PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 42 | విజయవాడ, శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No Vijayawada, Friday 12 September 2025 Rs

జౌళి పరిశ్రమకు సుంకాల పోటు

- 10 శాతం ఆదాయం పతనం
- క్రిసిల్ అంచనా

9



భారత హాకీజట్టుకు నిరాశ

- చైనా చేతిలో ఓడినా.. ఫైనల్ ఆశలు సజీవం

8

సుప్రీంకోర్టు శక్తి ఉడిగి కూర్చోవాలా ?

- ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- రాష్ట్రపతి ప్రస్తావనపై వాదనలు పూర్తి
- తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ప్రజాస్వామ్యంలోని ఒక విభాగం తన విధులను నిర్వర్తించడంలో విఫలమైతే, రాజ్యాంగ సంరక్షకురాలైన సుప్రీంకోర్టు శక్తి హీనురాలై, పని లేకుండా కూర్చోవాలా?' అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశ్నించారు. 143వ అధికరణ కింద రాష్ట్రపతి చేసిన ప్రస్తావనపై పది రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి, న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ ఎఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం తన తీర్పును రిజర్వు చేసుకుంది. గురువారం విచారణ సందర్భంగా సిజెఐ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎంత ఉన్నతాధికారంలో వున్న వ్యక్తి అయినా చట్టానికి అతీతుడు కాదు. ... నేను అధికారాల విభజన సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతాను. న్యాయపరమైన క్రియాశీలత న్యాయపరమైన ఉగ్రవాదంగా మారకూడదని గట్టిగా విశ్వసిస్తున్నా... అయితే అదే సమయంలో, ప్రజాస్వామ్యంలోని ఒక విభాగం తన విధులను నిర్వర్తించడంలో విఫలమైతే, రాజ్యాంగ సంరక్షకురాలిగా ఉన్న కోర్టు శక్తి ఉడిగి, పనేమీ లేకుండా చేతులు ముడుచుకుని కూర్చోవాలా?" అని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. రాష్ట్రాల్లో గవర్నర్ల పాత్రను ఊహించేటప్పుడు పరస్పర ఆమోద యోగ్యంతో కూడిన వాతావరణాన్ని రాజ్యాంగ రూపకర్తలు దృష్టిలో పెట్టుకున్నారని జస్టిస్ గవాయ్ అన్నారు. గవర్నర్ల మిగతా 9లో



ర్యాలీ అగ్రభాగాన ఎం.ఎ.బేబీ, వి.శ్రీనివాసరావు, పుణ్యవతి, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు తదితరులు

కేంద్రం కుట్రలను తిప్పికొట్టండి

ఉక్కును ప్రైవేటుపరం చేసేందుకే ఇఒఐల పేరిట ముక్కలుగా విభజన : ఎంఎ బేబీ

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు గాజువాకలో మహా ప్రదర్శన, సభ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

భారతదేశం గర్వించదగ్గ నవరత్న పరిశ్రమల్లో ఒకటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)ల పేరుతో ముక్కలు ముక్కలుగా చేసి ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రను విశాఖ ప్రజలంతా వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి హెచ్చరిక పంపాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం సాయంత్రం విశాఖలోని కొత్త గాజువాక కూడలి నుంచి పాత గాజువాకలోని వంటిల్లు జంక్షన్ వరకు సిపిఎం ఆధ్వర్యాన మహా ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన సభలో బేబీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు లూటీ చేసి అదాని, అంబానిలకు అప్పగించాలని చూస్తున్నారని తెలిపారు. ఉద్యమ నేత సీతారాం ఏచూరి తొలి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, అందుకు విశాఖపట్నం అంతా ప్రతినబూనాలని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే సభకు తనకు ఆహ్వానం అందిన వెంటనే దేశంలోని ఇతర స్టీల్‌ప్లాంట్ల పరిస్థితిని పరిశీలించానని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దేశంలోనే గర్వించదగ్గ నవరత్న సంస్థలలో ఒకటని తెలిపారు. దానిని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు లాభం చేకూర్చాలని కేంద్రం చూడడం దుర్మార్గమన్నారు. దేశంలోనే తొలి ఐఎస్ఒ సర్టిఫికేషన్ కలిగిన సంస్థ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అని, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సముద్ర తీరాన సీ పోర్టు కలిగిన ఏకైక కర్మాగారమని గుర్తు చేశారు. నవరత్న మిగతా 9లో

12 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

- ఐఎఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న తమీన్ అన్సారియాను గుంటూరు జిల్లాకు, అనంతపురం జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్‌ను బాపట్ల జిల్లాకు,నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌ను అనంతపురం జిల్లాకు,పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్‌ను శ్రీ సత్యసాయి జిల్లాకు కలెక్టర్లుగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్‌గా పనిచేస్తున్న కృతికా శుక్లాను పల్నాడు జిల్లాకు,ఎపిపిఎస్‌సి కార్యదర్శిగా ఉన్న పి రాజాబాబును ప్రకాశం జిల్లాకు, సమచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హిమాన్షు శుక్లాను నెల్లూరు జిల్లాకు, సిసిఎల్‌ఎ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎన్ ప్రభాకర్ రెడ్డిని పార్వతీపురం మన్యం జిల్లాకు, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా ఉన్న నిషాంత్ కుమార్‌ను అన్నమయ్య జిల్లాకు, సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా ఉన్న ఎ .సిరిని కర్నూలు జిల్లాకు,రీహెబిలిటేషన్ అండ్ సెటిలిమెంట్ కమిషనర్ ఎస్ రామసుందర్ రెడ్డిని విజయనగరం జిల్లాకు, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరిని తూర్పు గోదావరి జిల్లాకు కలెక్టర్లుగా నియమించింది.

గుంటూరు, పల్నాడు, బాపట్ల, విజయనగరం, తూర్పు గోదావరి, సత్యసాయి, కర్నూలు, అన్నమయ్య పార్వతీపురం మన్యం జిల్లాల నుండి బదిలీలైన కలెక్టర్లకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ సందర్భంగా తన నివాసం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకమని అన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రక్షించుకునేందుకు తెలుగు రాష్ట్రాల వామపక్షాలు గురుతర బాధ్యత పోషించాలి
- ఏచూరి వర్ధంతి సభలో బి.వి.రాఘవులు



ఏచూరికి నివాళులర్పిస్తున్న రాఘవులు, రమాదేవి, సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. సిపిఎం పూర్వ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవులు తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంతో పాటు విదేశాంగ విధానం, లౌకికవాదం, ఫెడరలిజం కూడా ప్రమాదాన్ని ఎదుర్కుంటున్నాయన్నారు. బిజెపి ఫాసిస్టు, మతోన్మాద ధోరణి నుండి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సి ఉందని, ఈ కృషిలో తెలుగు రాష్ట్రాల వామపక్ష ఉద్యమం గురుతర బాధ్యతను నిర్వహించాల్సిఉందని అన్నారు. . దేశంలో సోషలిజం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా సీతారాం ఏచూరి మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకెళ్ళారని, ఆయన స్ఫూర్తితో భవిష్యత్ కర్తవ్యాలను నిర్వహించాలని సూచించారు. ఏచూరి మరణించారనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నామన్నారు. భారత రాజకీయాల్లో పెనుమార్పులు వస్తున్న ప్రస్తుత సమయంలో అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్యశక్తుల పాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి లేనిలోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బిజెఎం, ఆర్ఎస్ఎస్ ప్రమాదాన్నిరేచూరి వివరించేవారని, దేశంలో బూర్జువా పార్టీలకు, బిజెపికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సామాన్యులు కూడా అర్ధం చేసుకునేలా చెప్పి, దాని ఫాసిస్టు ధోరణలను తెలియచేసేవారన్నారు. బిజెపి పాలనలో దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, ఫెడరల్, సామాజిక న్యాయవిలువలకు నష్టం జరిగిందన్నారు. రాబోయే కాలంలో ఇది మరింత తీవ్రమవుతుందన్నారు. ఈ ప్రమాదాన్ని దేశ ప్రజలకు చెప్పడంతోపాటు మార్క్సిస్టు దృక్పథాన్ని వివరించాలని చెప్పారు. సోషలిజాన్ని, మిగతా 9లో

విజ్ఞాన వీచిక...
జన విజ్ఞాన వేదిక

- 13, 14 తేదీల్లో విజయనగరంలో 18వ రాష్ట్ర మహాసభ
- హాజరు కానున్న 400 మంది ప్రతినిధులు


3

ప్రయివేటు యూనివర్సిటీలకు దీటుగా ఎఎన్‌యు

- 49వ వ్యవస్థాపక దినోత్సవంలో వివి గంగాధరరావు
- స్వర్ణోత్సవం లోగో ఆవిష్కరణ

సమర్ధ నిర్వహణతో నీటి భద్రత

- జలవనరులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకూడదని, అన్ని కాలాల్లోనూ జల వనరులు సమృద్ధిగా లభించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. జలవనరులశాఖపై గురువారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఒక ఏడాది వర్షాలు సరిగా లేకపోయినా ఎగువ రాష్ట్రాల నుండి జలాలు రాకున్నా ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది ఇదే సమయంతో పోల్చుకుంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువని, అయినప్పటికీ ఎక్కడా నీటి సమస్య ఉత్పన్నం కాలేదని అన్నారు. ఇది సమర్థ నీటి నిర్వహణతోనే సాధ్యమైందని చెప్పారు. సోమశిల, కండలేరు, బ్రహ్మంసాగర్ నింపే విషయంలో సమస్యలను పరిష్కరించాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో రూ.6518 కోట్ల విలువైన ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. దీనివల్ల 2,81,139 ఎకరాలకు కొత్తగా సాగునీరు ఇవ్వడంతో పాటు 3,38,326 ఎకరాలను స్థిరీకరించవచ్చని సిఎం చెప్పారు. హంద్రీనీవా పరిధిలో చెరువులను నింపితే 89,117 ఎకరాలకు సాగునీరు అందించొచ్చని అన్నారు. జిఎన్ఎస్-ఎస్ పూర్తి చేసి కడపకు నీరు తీసుకెళ్లేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాల న్నారు. నిలిచిపోయిన చోట అవసరమైతే మరలా టెండర్లు పిలవాలని సూచించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును రెండేళ్లలలో పూర్తి చేయాలన్నారు. వంశధార, నాగావళి, చంపావతి అనుసంధానం చేస్తూ ఈ ప్రాంతంలో అన్ని రిజర్వా యర్లు నింపడం ద్వారా ఉత్తరాంధ్రలో వాటర్ నెట్ వర్క్ ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

'తురకపాలెం' మరణాల నమోదులో నిర్లక్ష్యం

- బాధ్యులపై చర్యలు తప్పవు
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు నగర శివారులోని తురక పాలెంలో జరిగిన మరణాలను సకాలంలో నమోదు చేయడంలో నిర్లక్ష్యం చోటు చేసు కుందనిఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మంగళగిరి లోని తన కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఇదే తరహాలో వ్యవహరించా రన్నారు. శాఖాపరమైన విచారణ నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్యం లోపం, నీరు, ఆహారం కలుషిత ఘటనలతోనే సీజనల్ వ్యాధుల కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. సాధారణ స్థాయిలో కంటే కేసులు నమోదు ఎక్కువగా ఉంటే వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ఎందుకు గమనించలేకపోతున్నారని మిగతా 9లో

విజయవాడలో అతిసార విజృంభణ

122కు చేరిన కేసులు



న్యూ రాజరాజేశ్వరిపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడ నగరంలోని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేట (న్యూ ఆర్ఆర్ పేట)లో అతిసార కేసులు పెరుగుతున్నాయి. గురువారం సాయంత్రా నికి వందకుపైగా కేసులు నమోదయ్యాయి. మొత్తం 122 అతిసార కేసులు నమోదైనట్లు అధికారికంగా ప్రకటించారు. వీరిలో 61 మంది ఆస్పత్రుల నుండి డిశ్ఛార్జి కాగా, 61 మంది వివిధ చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. గంటగంటకు అతిసార కేసులు పెరుగుతున్నాయి. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు బాధితులు ఉన్నారు. పైపుల ద్వారా సరఫరా అవుతున్న మంచినీరు కలుషితం అయిన కారణంగా అతిసార ప్రబలినట్లు భావిస్తున్నారు.

మంత్రి నారాయణ పరామర్శ

అతిసార బాధితులను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం పరామర్శించారు. అతిసార ప్రబలడానికి కారణాలపై డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ సుహాసినితోనూ, మున్సిపల్ అధికారులతోనూ చర్చించారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, వైద్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విఎంసి కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తదితరులు అతిసార బాధితు లను పరామర్శించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

అతిసార వ్యాప్తిపై సమగ్ర విచారణ : సిపిఎం

నీటి కాలుష్యం, అతిసార వ్యాప్తిపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, ఇప్పటికే ప్రైవేటు వైద్యం పొందిన వారి ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. అతిసార రోగులను గురువారం బాబూరావుతో పాటు పలువురు సిపిఎం నేతలు పరామర్శించారు. అక్కడికి వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు సమస్య తీవ్రతను వివరించారు.

పీడిత జాతి విముక్తి ఆలోచనలో ఏచూరి అగ్రగణ్యులు

దేశాన్ని విచ్ఛిన్నం చేసే ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు ధోరణులపై వామపక్షాల ఐక్యపోరు : ఎంఎ బేబీ

విశాఖలో ఘనంగా సీతారాం ఏచూరి భవన్ ప్రారంభం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో నేడు ఆర్ఎస్ఎస్ నయా ఫాసిస్టు స్వభావంతో పోరాటాలను అణచాలని చూస్తోందని, అలాంటి ఆలోచనలు ఉన్న గూండాల గుంపును పోగేసుకుని కర్కశంగా, నేరపూరితంగా వ్యవహరించాలని చూస్తోందని, దీనికి విరుగుడుగా వామపక్ష శక్తులన్నింటినీ కలుపుకుని వామపక్ష భావజాలాన్ని నిలబెట్టడమే ఏచూరికి నిజమైన నివాళి అని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో నిర్మితమైన సీతారాం ఏచూరి భవన్ (సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం)ను గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పార్టీ నాయకులతో కలిసి నివాళ్లర్పించారు. అనంతరం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో బేబీ మాట్లాడుతూ ఏచూరితో తన 45 ఏళ్ల అనుబంధం, అనుభవాలను పంచుకున్నారు. ఏచూరి చనిపోయి ఏడాదవుతుందంటే వినడానికి కష్టంగా, బాధగా ఉందన్నారు. ఆయన విస్తృతంగా దేశ, విదేశాల్లో పర్యటనలు చేశారని, 2017 అక్టోబర్ విప్లవం శత విజయోత్సవం సందర్భంగా మాస్కో వెళ్లామని, లెనిన్ భౌతికకాయాన్ని సందర్శించామని గుర్తు చేసుకున్నారు. తాము పర్యటనలు చేసేటప్పుడు పలుమార్లు రైళ్లలో రిజర్వేషన్లు లేనప్పుడు పేపర్లు కిందన వేసుకుని పడుకొని వెళ్లేవారిమని చెబుతూ వేదికపై బేబీ ఉద్వేగానికి గురయ్యారు. దేశంలో సామాజిక, ఆర్థిక పోరాటాలు, పీడిత ప్రజలు, ఆదివాసీలు, వ్యవసాయ కార్మికుల విషయంలో వామపక్ష దృక్పథం గురించి మాట్లాడాల్సి వస్తే, ఈ ఆలోచనా దృక్పథంలో ఏచూరి అగ్రగణ్యులని కొనియాడారు. ఎక్కడ కార్మికులు ఉంటే అక్కడ, ఎక్కడ కులవివక్షత ఉంటే అక్కడ ఎర్రజెండా ఉండాలని బేబీ అన్నారు. వర్గపోరాటాలు, కార్మిక పోరాటాలను వామపక్ష శక్తులు నిర్వహించాలని సుందరయ్య, బిటిఆర్, బసవ పున్నయ్య, రామ్మూర్తి, జ్యోతిబసు, సూర్జిత్ వంటి నేతలంతా చెప్పారని... ఈ ఆలోచనలను పుణికిపుచ్చుకున్న వారు సీతారాం ఏచూరి అని, ఆయనను గుర్తు చేసుకోవడం అంటే పోరాటాలను గుర్తు చేసుకోవడమేనని అని వివరించారు. స్వాతంత్ర దినోత్సవం రోజు ప్రధాని మోడీ ఎర్రకోట నుంచి ఆర్ఎస్ఎస్‌ను గొప్పగా పొగిడారని, ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగం పట్ల విశ్వాసం లేదని, మత విద్వేషాలు, కల్లోలాలు రెచ్చగొట్టి ప్రజలను చంపడం ఈ గూండాల గుంపు పనని విమర్శించారు. ప్రజలు ఐక్యంగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీ చెబుతోందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ చూస్తున్నాయని, కేరళలో అదే ధ్యేయంగా పని చేస్తున్నాయని వివరించారు. తాను అస్సాం నుంచి ఇప్పుడు వచ్చానని, అక్కడ పౌరుల హక్కులను తొలగించేందుకు జిల్లా కమిషనర్‌ను నియమించారని గుర్తు చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రజల ఆస్తులని బేబీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. విశాఖలోని సీతారాం ఏచూరి భవన్ ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రంథాలయం, అభ్యుదయ సాహిత్యం ఇక్కడ ఉంటుందన్నారు.



సీతారాం ఏచూరి భవన్‌ను ప్రారంభిస్తున్న ఎం.ఎ.బేబీ, చిత్రంలో వి.శ్రీనివాసరావు, పుణ్యవతి, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు తదితరులు

'సూపర్ 6-సూపర్ హిట్' సభ ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికే : వి శ్రీనివాసరావు

విశాఖలోని సీతారాం ఏచూరి భవన్ కొత్త సమాజం కోసం నిర్మించుకున్న పోరాట కేంద్రమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏచూరి స్ఫూర్తితో ఏర్పాటైన ఈ భవన్ ఉద్యమాల కేంద్రంగా విలసిల్లాలని పేర్కొన్నారు. 2024 అక్టోబర్ 7న ఈ భవన్‌కు శంకుస్థాపన చేసి, ఏచూరి ప్రథమ వర్ధంతిలోపే పూర్తి చేయడం అభినందనీయమన్నారు. దేశం ప్రస్తుతం రెండు సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. బయట నుంచి ట్రంప్ సుంకాలు, లోపల నుంచి మోడీ ఆర్థిక, మతోన్మాద, విచ్ఛిన్నకర దాడులను దేశం ఎదుర్కొంటున్న విషయాన్ని వివరించారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయొద్దంటూ ట్రంప్ మన దేశంపై ఒత్తిడి తెస్తోన్నా, ప్రధాని మోడీ మాట్లాడడం లేదన్నారు. మనిషికి ఓటు అనేది ప్రజాస్వామిక హక్కు అని, దేశంలో బీహార్, అస్సాం రాష్ట్రాల్లో కొన్ని తరగతుల ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఓటు హక్కుపై దాడికి మోడీ ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టిడిపి కూటమి నేడు మాట తప్పిందన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు... ట్రేడ్ యూనియన్ నాయకులపైనా, విశాఖ స్టీల్ ప్లాంట్‌పైనా అభాండాలు మోపి ఉక్కు రక్షణకు వెన్నుపోటు పొడిచి ఉద్యమం గొంతు కొయ్యాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని 'కూటమి' పార్టీలు భ్రష్టుపట్టిస్తున్నాయని, అనంతపురంలో 'సూపర్ 6 – సూపర్ హిట్' పేరిట జరిపిన సభ రాష్ట్ర ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికేనని విమర్శించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ సీతారాం ఏచూరి భవన్ ఈ ప్రాంత ప్రజల పోరాటాలకు, సాంస్కృతిక, అభ్యుదయ కార్యక్రమాలకు వేదిక కానుందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ బంగారు కుటుంబాల పేరుతో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వివరించారు. ప్రస్తుత ఉత్తరాంధ్ర నాయకులంతా కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేస్తున్నారన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి భవన్ అనుకున్న సమయం కంటే ముందే పూర్తయిందని, ఈ భవనానికి ప్రధాన దాతలు కార్మికులు, కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులేనని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, అధిక సంఖ్యలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇతర వామపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు.



ధర్నా చేస్తున్న నిరుద్యోగులకు సంఘీభావం తెలియజేస్తున్న లక్ష్మణరావు

స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

- డివైఎఫ్ఐ ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో డివైఎఫ్ఐ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు 86 వేల మంది ఉన్నారని తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు లేరని పేర్కొన్నారు. జులై 15వ తేదీలోపు ప్రత్యేక డిఎస్సికి నోటిఫికేషన్ విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రత్యేక విద్య కోర్సు చదివిన నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని చెప్పారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిలో భర్తీ చేసి వారి శక్తి, సామర్థ్యాలను సమాజం కోసం వినియోగించాలని చెప్పారు. డివైఎఫ్ఐ కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ బిఇడి, డిఇడి చేసిన నిరుద్యోగులు 20 ఏళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జివో 13 ప్రకారం 2,260 పోస్టులకు తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు బసవ, కృష్ణ, మహేష్, అభ్యర్థులు బాబు, మధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మధ్యాహ్న భోజన పథకం జాయింట్ డైరెక్టర్ గంగాభవానీని విజయవాడలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. మహిళా కార్మికులు రోజుకు 7 నుంచి 8 గంటల పాటు అతి తక్కువ వేతనం రూ.3 వేలతో వెట్టిచాకిరీ చేస్తున్నారని తెలిపారు. నెలల తరబడి వేతనాలు, బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరారు. యోగా డే రోజు విద్యార్థులకు పెట్టిన అల్పాహార బిల్లులను ఇప్పటివరకు చెల్లించలేదని పేర్కొన్నారు.

కార్మికులకు రాష్ట్రప్రభుత్వం కనీసం రూ.10వేల వేతనం ఇవ్వాలని కోరారు. గ్యాస్‌బండ, స్టవ్‌లను ప్రభుత్వమే అందించాలని తెలిపారు. మెనూ ఛార్జీలు పాఠశాల విద్యార్థులకు కనీసం రూ.20, కళాశాల విద్యార్థులకు రూ.40 చొప్పున చెల్లించాలని కోరారు. కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించి, పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పథకం అమలుకు కనీస మౌలిక వసతులైన వంటషెడ్లు, మంచినీరు, గ్లౌజ్‌లు, మాస్కులు, యాప్రాన్ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి సమ్మక్క, పి రూతుకుమారి, ఎం లలితకుమారి, జి పాండు రంగమ్మ తదితరులు ఉన్నారు.

సవరణ

'ప్రజాశక్తి' మొదటి పేజీలో 11.9.2025న వచ్చిన శీర్షికలోనూ, వార్తలోనూ... వచ్చే నెల 15వ తేదీన వాహనమిత్ర పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించినట్టు తప్పుగా వచ్చింది. దీనిని వచ్చే నెల 2వ తేదీ అని చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

-ఎడిటర్

సుంకాలు, సీడ్, ఫీడ్ ధరల నియంత్రణతోనే ఆక్వా రంగం మనుగడ

- సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికా సుంకాల సమస్య పరిష్కరించడంతో పాటు, సీడ్, ఫీడ్ ధరల నియంత్రణకు చర్యలు తీసుకున్నప్పుడే ఆక్వా రంగం మనుగడ సాగించగలదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సుంకాల పేరుతో అమెరికాకు ఎగుమతి చేయని కౌంట్‌ల ధరలను సైతం ఎగుమతిదారులు తగ్గించడంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఆక్వా రంగాన్ని వ్యవసాయరంగంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సుకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సదస్సులో పాల్గొన్న ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి బలరామ్ మాట్లాడుతూ.. అమెరికాతో సుంకాలపై కేంద్రం తక్షణమే చర్చలు జరపాలన్నారు. ఆక్వా ఉత్పత్తులకు ధరలను ప్రభుత్వమే నిర్ణయించాలని కోరారు. సీడ్, ఫీడ్‌ల నాణ్యత, వాటి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దేశీయంగా రొయ్యలు, చేపల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ రాయితీ అమల్జేయాలని, అదనపు భారాలను ఆక్వా రైతులపై మోపరాదని కోరారు. ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఫోన్‌లో తన సందేశాన్ని ఇస్తూ.. దేశంలో రొయ్యల సాగులో 66 శాతం, చేపల సాగులో 33 శాతం రాష్ట్రంలో జరుగుతుందని తెలిపారు. ఆమెరికా సుంకాల నేపథ్యంలో రష్యాకు ఆక్వా ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. యూరప్‌కు దేశం నుంచి ఆక్వా ఎగుమతులు ప్రస్తుతం 15 శాతం మాత్రమే ఉన్నాయని, మరింత పెంచాలన్నారు. 'క్షీరా రామ' ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటనర్సయ్య (చినబాబు) మాట్లాడుతూ..అమెరికా సుంకాలను అవకాశంగా తీసుకుని వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. పంట వేసే సమయం, ఉత్పత్తి తీసుకునే సమయాలను నిర్ణయిస్తూ, కామన్ పాలసీని ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు వక్కలగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. అమెరికా సుంకాల ప్రభావం ఆక్వా రంగంపైనా కాకుండా జౌళి, మెడికల్, వస్త్ర, వ్యవసాయ తదితర రంగాల ఉత్పత్తులపై ఉందన్నారు. వచ్చే నెల 3 నుంచి అమెరికా దిగుమతులపై క్వాలిటీ నిబంధనలు మరింత కఠినం చేయనుందన్నారు. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని, ఉత్పత్తుల నిల్వకు అవసరమైన గిడ్డంగులు కోల్డ్ స్టోరేజి సదుపాయాలు అందుబాటులోకి తేవాలన్నారు. ఆక్వా రైతు ఆమంచి సోములు మాట్లాడుతూ.. అమెరికాలో ఉన్న ట్రంప్ కంటే స్థానికంగా ఉన్న ట్రంప్‌ల వల్లే రైతులకు ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. ముడి సరుకు ధరలు పెరిగినప్పుడు ఫీడ్ ధరలు పెంచి, ముడిసరుకు ధరలు తగ్గినా ఫీడ్ ధరలు తగ్గించడం లేదన్నారు. ప్రభుత్వం కిలోకు రూ.15 తగ్గించాలని ఆదేశించినా కేవలం రూ.3 మాత్రమే తగ్గించారని తెలిపారు. ఆక్వా సమస్యలపై అన్ని సంఘాలను సమన్వయం చేసేందుకు రాష్ట్ర స్థాయిలో 10 మంది సభ్యులతో అడ్‌హక్ కమిటీని ఈ సమావేశంలో ఏర్పాటు చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆక్వా సమస్యలపై సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, అధ్యక్షులు వై రాధాకృష్ణ, ఆక్వా సంఘాల నాయకులు తేళ్ల రామయ్య, భక్తవత్సల రెడ్డి, ప్రత్తిపాటి రామాంజనేయులు, కె.నర్సింహారావు, యువరాజు, సోమశేఖర్‌రెడ్డి, కె.ప్రభాకర్, అలీహుస్సేన్, గూడపాటి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కొటిరెడ్డి, అక్వా టెక్ ఎడిటర్ కె.జోసఫ్ తదితరులు ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆక్వా రైతు



రహదారిపై ఆందోళన చేస్తున్న బాధితురాలి కుటుంబసభ్యులు, బంధువులు

కుమారుడిని చంపిన తండ్రి

- భార్యపైనా దాడి

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు)

భార్యపై అనుమానంతో కుమారుడిని కన్నతండ్రి హతమార్చాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... దేవనకొండ మండలం వెలమకూరు గ్రామానికి చెందిన నరేష్ తన భార్య శ్రావణి, కుమారుడు సాగర్ (ఎనిమిది నెలలు)తో కలిసి నివసిస్తున్నారు. భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో గురువారం మరోసారి గొడవపడ్డాడు. ఇనుపరాడ్‌తో శ్రావణిపై విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం కుమారుడిని నీటి డ్రమ్ములో ముంచి హతమార్చారు. రక్తపు మడుగులో ఉన్న శ్రావణిని నరేష్ అవ్వ గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని శ్రావణిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న శ్రావణి తల్లిదండ్రులు, బంధువులు వెలమకూరుకు తరలివచ్చారు. నిందితుడిని తమకు అప్పగించాలంటూ పత్తికొండ- దేవనకొండ రహదారిపై బాలుడి మృతదేహంతో బైఠాయించారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని సిఐ తెలిపారు.

నేపాల్ నుంచి రాష్ట్రానికి చేరుకున్న 144 మంది

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేపాల్‌లో చిక్కుకున్న వారిలో 144 మంది రాష్ట్రానికి గురువారం చేరుకున్నారు. ప్రత్యేక విమానం ద్వారా వారు చేరుకున్నారు. వీరిని రాష్ట్రానికి రప్పించేందుకు అవసరమయిన ఏర్పాట్ల కోసం విద్య, ఆర్‌టిజిఎస్ మంత్రి నారా లోకేష్ సచివాలయంలో ఆర్‌టిజిఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సమీక్ష చేశారు. 104 మంది విశాఖ విమానాశ్రయానికి, 40 మంది తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి స్వాగతం పలకాలని మంత్రి లోకేష్ కూటమి ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేశారు.

తిరుమలలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కుటుంబ సమేతంగా తిరుమల విచ్చేశారు. గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమల చేరుకున్నారు. పద్మావతి అతిథిగృహం వద్ద టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి ఆమెకు స్వాగతం పలికారు. గురువారం రాత్రి తిరుమలలో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకుంటారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణతో వైద్య విద్య భారం: పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేసేస్తాం వైద్య విద్య భారంగా మారుతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ షర్మిల అన్నారు. పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటికే 2,600 మెడికల్ సీట్లు ఉన్నాయని, కొత్త కళాశాలలు పూర్తయితే మరో 2,500 సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. వైద్య కళాశాలలను నారాయణ వంటి ప్రైవేటు విద్యా సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో రైతులకు భరోసా లేదన్నారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఏ పంటకు కనీస మద్దతు ధర అందడం లేదని చెప్పారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయితే జనాలకు ఆ పథకాలు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. మెజారిటీ పథకాలు అమలు చేయకుండా సూపర్ ఫ్లాప్ చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం వల్లే తన కొడుకును రాజకీయాల్లోకి తీసుకువస్తున్నట్లు వైసిపి మార్ఫింగ్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తోందని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి వైసిపి మద్ధతు ఇవ్వడాన్ని తప్పుబట్టారు.

థర్మల్ పవర్ ప్లాంట్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు

- వెనుదిరిగిన అధికారులు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ డిపిఆర్ సర్వేను గిరిజనులు అడ్డుకున్నారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస సమీపంలో ఎపి జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిప్పన హరిరెడ్డి, రాష్ట్ర స్పేస్ అప్లికేషన్ సెంటర్ శాస్త్రవేత్త సిహెచ్.తాతబాబు ఆధ్వర్యంలో ట్రోపోగ్రాఫికల్ సర్వే చేసేందుకు గురువారం వచ్చారు. డిపిఆర్ నిమిత్తం అధికారులు ఫీజుబులిటీ సర్వే నిర్వహిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న సరుబుజ్జిలి, బూర్జ మండలాల గిరిజనులు అక్కడికి చేరుకుని సర్వే అధికారులను అడ్డుకున్నారు. సర్వేకు ఉపయోగించే డ్రోన్ కెమెరాలు, ఇతర సామగ్రిని తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణకు సర్వే అధికారులు ఫోన్‌చేసి చెప్పారు. సిఐతో పాటు బూర్జ ఎస్ఐ ఎం.ప్రవళిక తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. గిరిజనులకు నచ్చజెప్పి వారి నుంచి డ్రోన్ కెమెరా, సామగ్రిని తిరిగి అధికారులకు అప్పగించారు. సర్వే చేసేందుకు వీల్లేదని గిరిజనులు పట్టుపట్టడంతో అధికారులు వెనుదిరిగారు.



సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకున్న గిరిజనులు

అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతున్న జగన్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైసిపి అధినేత చేస్తున్న అసత్య ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇంట్లో కూర్చొన్ని అప్పుడప్పుడు మీడియా సమావేశాలు, సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. అనంతపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను 15 నెలల్లోనే నెరవేర్చామన్నారు. 2047 విజన్ సాధించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభను విజయవంతం చేసిన టిడిపి కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చినా వైసిపి నేతలు అసత్యారోపణలు చేస్తున్నారని, వైసిపి అధికారంలో ఉన్నన్ని రోజులూ సభలకు ప్రజలను బలవంతంగా తీసుకెళ్లిందని, సభ నుంచి బయటకు రాకుండా గేట్లకు తాళాలు వేశారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపిలు బికె.పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతూ డి.రమాదేవి

ఉద్యమాలతో విమల ఆశయాలు ముందుకు...

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

ఉజ్వలమైన ప్రజా, మహిళా, సామాజిక ఉద్యమాలు నిర్వహించడం ద్వారా అమరజీవి గారపాటి విమల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఏలూరులోని శనివారపుపేటలోగల హేలాపురి లయన్స్ ఆడిటోరియంలో గారపాటి విమల సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత విమల చిత్రపటానికి రమాదేవి, నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో రమాదేవి మాట్లాడుతూ ప్రజల్లో అసమానతలు పోవాలని, సమానత్వం రావాలని గారపాటి విమల నిరంతరం పరితపించారన్నారు. మహిళా ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం ద్వారా ప్రజా జీవితాన్ని కొనసాగించారని, కమ్యూనిస్టుగా ప్రజల తరఫున పోరాటాల్లో అగ్రభాగాన నిలిచేవారని గుర్తు చేశారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ గారపాటి విమల కుటుంబం యావత్తు ప్రజా ఉద్యమాలతో ముడిపడి ఉందని తెలిపారు. మరణానంతరం భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించిన త్యాగశీలిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో విమల బంధువు పాతూరి రవి, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ఐద్వా నేతలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోండి

- వచ్చే నెల 31తేదీ వరకూ అవకాశం
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులను సరిచేసుకునేందుకు వచ్చే నెల 31వ తేదీ వరకూ అవకాశం కల్పించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇందుకోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చే వారం నుంచి 'మనమిత్ర' వాట్సాప్‌లోను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. విజయవాడలోని కానూరులో సివిల్ సప్లైస్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఆధార్ సమాచారం ఆధారంగా స్మార్ట్ రేషన్ కార్డులు ముద్రించినట్లు తెలిపారు. ఆధార్ కార్డులో పేర్లు, చిరునామాలు మార్పులు చేసుకోకపోవడం వల్ల కొందరి కార్డుల్లో వివరాలు తప్పులు దొర్లయాని పేర్కొన్నారు.

నూతన సాంకేతికతతో క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులను కొన్ని చోట్ల 95 శాతం, మరికొన్ని చోట్ల 85 శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. నాలుగు విడతల్లో 1.45 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రేషన్ తీసుకోవడంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆయా షాపు వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకురావచ్చన్నారు. వచ్చే నెల 31వ తేదీ వరకూ స్మార్ట్ రేషన్ కార్డులు ఉచితంగా పంపిణీ చేస్తామని, నవంబరు 1 నుంచి నామినల్ ఫీజు రూ.35 చెల్లిస్తే కార్డులు పోస్టులు ఇంటికే పంపిస్తామని తెలిపారు. వరుసగా 3 నెలలు రేషన్ తీసుకోకపోతే కార్డు ఇన్‌యాక్టివేట్ అవుతుందని, సమీపంలోని సచివాలయానికి వెళ్లి సమాచారం ఇస్తే కార్డును యాక్టివేట్ చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో 4.42 కోట్ల మందికి ప్రతి నెలా రేషన్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 97.59 లక్షల మందికి తొలి విడతలో దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 5 కేజీల సిలిండర్‌కు బదులు 14.2 కేజీల సిలిండర్ అందిస్తున్నట్లు చెప్పారు.

పెండింగ్ కారుణ్య నియామకాలు చేపట్టాలి

- ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వెయ్యి కారుణ్య నియామకాలు చేపట్టాలని ఎపిటిఎఫ్ కోరింది. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల్లో మ్యూచువల్, స్పౌజ్ కేటగిరీలలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశధర్‌ను కోరారు.

పండిట్స్‌కు ఎస్ఎగా ఉద్యోగోన్నతి : టిఎన్‌యుఎస్

రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) పూల్ భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఎ)గా ఉద్యోగోన్నతి కల్పించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1,209 మంది డిఇఒ పూల్ భాషా పండితులు కేడర్, శాశ్వత స్థానాలు లేక ఒకచోట పనిచేస్తూ మరో చోట జీతం తీసుకుంటూ ఆరేళ్లుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

విజ్ఞాన వీచిక... జన విజ్ఞాన వేదిక

- 13, 14 తేదీల్లో విజయనగరంలో 18వ రాష్ట్ర మహాసభ
- హాజరు కానున్న 400 మంది ప్రతినిధులు



రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

సగటు మనిషికి శాస్త్రీయ విజ్ఞానం అందించడమే ధ్యేయంగా పనిచేస్తోన్న జన విజ్ఞాన వేదిక (జెవివి) మరో మైలురాయిని దాటుకుంటూ 18వ రాష్ట్ర మహాసభకు సిద్ధమైంది. 37 ఏళ్ల చరిత్రగల జెవివి మహాసభకు విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరం వేదిక కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభకు సుమారు 400 మంది ప్రతినిధులు, ప్రముఖులు, అన్ని రంగాలూ, తరగతులకు చెందిన విద్యావంతులు, మేధావులు, సామాజికవేత్తలు హాజరు కానున్నారు. ఓవైపు మానవుడు అంతరక్షంలోకి వెళ్లి పరిశోధనలు చేస్తున్నప్పటికీ, మరోవైపు అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాలు పెరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో సైన్స్ ప్రకారం జీవించడం, ఆలోచించడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు అవకాశం ఉంటుందనే ధృఢమైన సంకల్పంతో 1988లో జెవివి ఆవిర్భవించింది. ఇందుకనుగుణంగా శాస్త్రీయ, వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. పర్యావరణం, విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం తదితర అంశాలపైనా అనేక ఉద్యమాలు నిర్వహించింది. రాష్ట్రంలో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు సంభవించినా, సైన్సుకు సంబంధించి ఏ అంశం ముందుకొచ్చి చర్చనీయాంశంగా మారిన ప్రతి పరిస్థితుల్లోనూ, మూఢనమ్మకాలు చెలరేగి ప్రజల ధన, మాన ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనూ జెవివి కార్యకర్తలు ముందుండి పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. అక్షరాస్యత ప్రాధాన్యతను కొన్ని దశాబ్దాల క్రితం నుంచే జనానికి తెలియజేసి చైతన్యవంతులను చేసింది. మద్యపాన నిషేధం, ప్రజారోగ్యం, చేప మందు వ్యతిరేక పోరాటం, విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేందుకు చెకుముఖి మాసపత్రిక నడపడం వంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తోంది. మెరుగైన సమాజం కోసం జెవివి చేస్తోన్న విశేష కృషిని అభినందిస్తూ 2005లో అప్పటి కేంద్రప్రభుత్వం అవార్డును ప్రదానం చేసింది. మహాకవి గురజాడ పుట్టిన విజయనగరంలో ఈ నెల 13, 14 తేదీల్లో 18వ రాష్ట్ర మహాసభ నిర్వహించుకునేందుకు సన్నద్ధమైంది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, నాయకులు వి.రాజ్‌గోపాల్, చీకటి దివాకర్, జి.నిర్మల గురువారం విజయనగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆవిష్కరించారు.

మహాసభకు హాజరు కానున్న ప్రముఖులు

13వ తేదీ ప్రారంభ సభకు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, కలెక్టర్ హాజరు కానున్నారు. ప్రధాన వక్తగా మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరై ప్రసంగించనున్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం జెవివి ప్రస్థానాన్ని వివరించనున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి-పరిశీలన అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తారు. 14వ తేదీ ఉదయం ఆరు గంటలకు నగరంలో సైన్సు వాక్ నిర్వహించనున్నారు. అనంతరం ప్రతినిధుల సభలో పర్యావరణం అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగిస్తారు. వి.బాలసుబ్రమణ్యం ముగింపు ఉపన్యాసం చేయనున్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ ఎన్నిక జరగనుంది.



లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రయివేటు యూనివర్సిటీలకు ధీటుగా ఎఎన్‌యు

- 49వ వ్యవస్థాపక దినోత్సవంలో విసి గంగాధరరావు
- స్వర్ణోత్సవం లోగో ఆవిష్కరణ
- మాజీ విసిలకు సత్కారం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఎఎన్‌యు) 49వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం వేడుకగా జరిగింది. స్వర్ణోత్సవ లోగోను అతిథులు ఆవిష్కరించగా అనంతరం జరిగిన సభకు రెక్టార్ ప్రొఫెసర్ రత్నశీలామణి అధ్యక్షత వహించారు. వైస్ ఛాన్సలర్ కె గంగాధరరావు మాట్లాడుతూ 1976లో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన మూడు వర్సిటీలైన శ్రీకృష్ణదేవరాయ, కాకతీయ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీల్లో ఎఎన్‌యు ఎంతో ప్రగతిని సాధించిందని తెలిపారు. వర్సిటీకి వృత్తి విద్య కళాశాలలు ఆర్థిక స్థిరత్వం తెచ్చాయని, అమరావతి ప్రాంతంలోని ప్రయివేటు యూనివర్సిటీలకు దీటుగా ఎఎన్‌యును నిలబెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అధ్యాపక పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని అన్నారు. అమెరికా వంటి అగ్రదేశాల నుండి సవాళ్లను అధిగమించడానికి టెక్నాలజీ ఎంతో ఉపయోగపడిందని పేర్కన్నారు. రానున్న పదేళ్లలో అమెరికా, చైనాను మించి భారత్ ప్రగతి సాధించే అవకాశముందని, ఇందుకు విద్యార్థుల కృషి అవసరమని చెప్పారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం దేశ ప్రగతికి ప్రయోజనమని అన్నారు. పూర్వ విసిలు మాట్లాడుతూ ఎఎన్‌యు ప్రగతిలో ఎంతో మంది దాతలు, పూర్వ విద్యార్థుల కృషి ఉందని కొనియాడారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ యూనివర్శిటీల్లో 60 శాతం నుంచి 75 శాతం వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి భర్తీ కోసం మెగా డిఎస్సీ తరహాలో మెగా యూనివర్శిటీ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షులు రత్నశీలామణి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు స్వర్ణోత్సవాలు కొనసాగుతాయని ప్రకటించారు. స్వర్ణోత్సవాల లోగో ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా మాజీ విసిలు తమ అనుభవాలను, సూచనలను పంచుకున్నారు. అనంతరం మాజీ విసిలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన వర్సిటీ ప్రొఫెసర్లను సత్కరించారు.

19న మెగా డిఎస్‌సి అభినందన సభ

- అదే రోజు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మెగా డిఎస్‌సిలో ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన అభ్యర్థులతో ఈ నెల 19న సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ప్రభుత్వం అభినందన సభ జరగనుంది. ఈ మేరకు జిల్లా అధికారులకు గురువారం సమాచారం అందింది. ఈ నెల 19న వెలగపూడి సచివాలయం ప్రాంగణం వెనుక భాగంలో ఈ సభ నిర్వహించనున్నారు. ప్రధానంగా డిఎస్‌సిలో ఎంపికైన 26 జిల్లాలకు చెందిన 16,374 మంది అభ్యర్థులతో పాటు ఒక్కొక్క అభ్యర్థికి తోడుగా వారి తల్లిదండ్రుల్లో ఒకరికి ఈ సభలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. మొత్తం 32 వేల మందితో ఈ సభ జరగనుంది. ఈ సభలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఉల్లి ఎగుమతికి చర్యలు

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా


మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లు, ఇతర జిల్లాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన ఉల్లి పంటను గురువారం ఆయన పరిశీలించారు.

దెబ్బతిన్న ఉల్లిని మార్కెట్‌కు తీసుకురావద్దని, బాగా ఆరబెట్టిన తర్వాతే పంటను తీసుకురావాలని, అప్పుడే మంచి ధర లభిస్తుందని రైతులనుద్దేశించి కలెక్టర్ అన్నారు. ఉల్లి నాణ్యతను పరిశీలించి ఎ, బి గ్రేడ్లుగా విభజించి, నాణ్యత ఉన్న ఉల్లిని ఇతర జిల్లాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఉల్లి వేసిన 110 రోజుల తర్వాతనే పంటను రైతులు మార్కెటుకు తీసుకువస్తున్నారా? లేదా? అని ఉద్యానశాఖ అధికారులు పరిశీలించాలన్నారు. నాణ్యత బాగా ఉన్న ఉల్లిని ఎక్కువ ప్రమాణంలో ట్రేడర్లు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, మార్క్‌ఫెడ్ డిఎం రాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

6,740 ఎకరాల్లో కొప్పర్తి అభివృద్ధి

- విశాఖ-చెన్నై కారిడార్‌కు కీలకం
- మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ (విసిఐసి) పరిధిలోని కొప్పర్తి ప్రాంత అభివృద్ధికి 6,740 ఎకరాలతో మాస్టర్ ప్లాన్ ఆమోదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన విధానాన్ని కూడా గురువారం ప్రకటించింది. ఈ ప్రాంతంలో ఏయే రంగాలకు ఎంత భూమిని కేటాయించాలన్న దానిపైనా ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. అలాగే కేటాయించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలి అన్నదానిపైనా మాస్టర్ ప్లాన్‌లో వివరించారు.రాష్ట్రంలోని పలు జిల్లాలను కలుపుతూ చెన్నై వరకు పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు విసిఐసిని ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగానే కడప జిల్లాలోని కొప్పర్తి ప్రాంతాన్ని కూడా ఒక నోడ్‌గా గుర్తించారు. ఈ పరిధిలో కొప్పర్తి, తాడిగొట్ల, టిజి పల్లి, ఏడవపురం, అంబవరం, రంపతాడు గ్రామాల్లో పారిశ్రామికీకరణ చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికే భారీ భూమిని కేటాయిస్తూ మాస్టర్ ప్లాన్‌ను కూడా సిద్ధంచేశారు. కేటాయించిన భూమిలో 53.2 శాతంతో 3,585.53 ఎకరాల భూమిని పరిశ్రమల స్థాపనకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. అలాగే వాణిజ్య అవసరాలకు 120.47 ఎకరాలు, నివాస సముదాయాలకు 167.83 ఎకరాలు, రవాణా సౌకర్యాలకు 307.7 ఎకరాలు, ప్రజావసరాలకు 105.24 ఎకరాలను. సౌకర్యాలకు 106 ఎకరాలు, పార్కింగ్‌కు 129.04 ఎకరాలు, ఆహ్లాద రంగానికి 411.64 ఎకరాలు, రోడ్లకు 837.4 ఎకరాలు, నీటికి 808.9 ఎకరాలు, ఇతర అవసరాలకు 160.56 ఎకరాల చొప్పున వినియోగించుకోవాలని నిర్దేశించింది.

నాలుగు విభాగాల పరిశ్రమలు

ఇదే సమయంలో ఈ ప్రాంతంలో ఏయే పరిశ్రమలకు అవకాశాలు ఉంటాయన్నదానిపైనా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మొత్తం మూడు రకాల పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు ఈ మాస్టర్ ప్లాన్‌లో నిర్ణయించారు. రెడ్, ఆరంజ్, గ్రీన్ కేటగిరీలుగా విభజించారు. రెడ్ కేటగిరీలో రసాయనాల నిల్వ, లూబ్రికేటింగ్ ఆయిల్స్, ఫాస్ఫేట్ రాళ్ల ప్రాసెసింగ్ యూనిట్లు, మినీ హైడల్ విద్యుత్ కేంద్రాలు, మందులు, చక్కెర వంటి 59 రకాల పరిశ్రమలు ఉంటాయి. అలాగే ఆరెంజ్ విభాగంలో 83 రకాల పరిశ్రమలు, గ్రీన్ కేటగిరిలో 63 రకాలు, వైట్ కేటగిరీలో 36 రకాల పరిశ్రమల ఏర్పాటునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వద్దని ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రంగరాయ మెడికల్ కాలేజ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయొద్దంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కాకినాడ జిల్లా కేంద్రంలోని రంగరాయ మెడికల్ కళాశాల వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి శ్రీకాంత్, ఎం గంగాసూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ సీటులను తీసుకుని వస్తే.. నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చాక వంద శాతం సీట్లు ఉన్న పది కాలేజీలను ప్రయివేటీకరణ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. దీని వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అయ్యే ప్రమాదముందని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యను ప్రయివేటు విద్యాసంస్థల్లో చదవాలంటే రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తుందని, ఫీజులు కట్టలేక వారు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ గ్రూపులో కాలేజీల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు ఏడాదికి సుమారు రూ.13.20 లక్షలు చెల్లించాల్సి ఉందని, అదే ప్రభుత్వ కళాశాలలో అయితే కేవలం సుమారు రూ.15 వేలు మాత్రమే ఫీజు ఉంటుందని తెలిపారు.

ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎ వాసుదేవ్, కె సిద్ధు, సిహెచ్ లోవరాజు, సత్యం, ఆదర్శ, సంతోష్, అక్షర, లౌక్యశ్రీ, లేఖవర్షిణి, ఐశ్వర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ నుంచి నూతన శ్రేణి రిఫ్రిజిరేటర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ గృహోపకరణాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా 183 లీటర్ల సామర్థ్యం కలిగిన సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణీని విడుదల చేసినట్లు వెల్లడించింది. రెండు పూల నమూనాలు, బెగోనియా, వైల్డ్ లిలీలలో ఎనిమిది కొత్త మోడళ్లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఇందులో 3 స్టార్ రేటింగ్ మోడళ్ల ధరలను రూ.19999గా, 5 స్టార్ మోడళ్ల ధరలను రూ.21,999గా నిర్ణయించింది.

'ఇండోసోల్'కు భూములు ఇవ్వం

- గ్రామ సభ తీర్మానాలు అమలు చేయాలి
- సబ్ కలెక్టర్‌కు కరేడు, ఉప్పరపాలెం దళితుల వినతి

ప్రజాశక్తి-కందుకూరు

ఇండోసోల్‌కు భూములు ఇవ్వబోమని, తమ గ్రామాన్ని ఖాళీ చేయబోమని కరేడు, ఉప్పరపాలెం గ్రామ దళితులు గురువారం కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీకి వినతిపత్రం అందజేశారు. దళిత కాలనీవాసులు, మహిళలు ఈ సందర్భంగా తమ గోడును సబ్ కలెక్టర్‌కు తెలిపారు. 2025 మార్చి 25న జిఒ నెం 43 ద్వారా కరేడు పంచాయతీలో 8,348 ఎకరాల భూములను, ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టేందుకు జూన్ 21న నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఉప్పరపాలెం దళిత కాలనీ, రామకృష్ణాపురం పొట్టేనుగుంట గిరిజన సంఘాలను ఖాళీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ భూములు, ఇళ్లు.. ఇండోసోల్‌కు ఇచ్చేదిలేదని 2025 జులై 4న జరిగిన గ్రామ సభ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా కరేడు పంచాయతీ కార్యదర్శి తమ సచివాలయ సిబ్బందితో తమ మూడు గ్రామాల్లోకి వచ్చి ఇంటింటి సర్వే చేయడం, కొలతలు అకౌంట్ నంబర్ వివరాలతో పాటు సంతకాలు తీసుకుంటున్నారని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. "ఇండోసోల్‌కు ఇళ్లు ఇవ్వకపోతే బలవంతంగా తీసుకుంటామని, ఇళ్లు కూలదోస్తామని.. ఇవ్వని వారిపై పోలీస్ కేసులుపెడతామని వారు బెదరిస్తున్నారని తెలిపారు. తమ గ్రామాలకు చెందిన చాలా మంది విద్య, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని, వాళ్లు లేని సమయంలో వారి తల్లిదండ్రులను భయపెట్టి బలవంతంగా సర్వే చేస్తున్నారని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. మా గ్రామంలోని 30 యాక్ట్‌ను, రైతులు ప్రజలపై, మాకు మద్దతు తెలిపిన ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఉప్పరపాలెం గ్రామస్తులు గంజి చిన కోటేశ్వరరావు, గంజి ప్రసాద్, గంజి అభిషేక్, గంజి శ్రీను, కొట్టే మాలకొండయ్య, గంజి రమణమ్మ, పిచ్చమ్మ, తోపాటు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. కరేడు రామకష్ణాపురం గిరిజనులు కత్తి కొండయ్య, యేసు రాణి, సురేంద్ర, శిరీష, అర్చన తదితరులు సంఘీభావం తెలిపారు.

అమెజాన్ పే, ఐసిఐసిఐ బ్యాంక్ భాగస్వామ్యం పునరుద్ధరణ

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పే, ఐసిఐసిఐ బ్యాంక్ తమ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించినట్లు ప్రకటించింది. ఇది భారతదేశంలో 5 లక్షలకు పైగా కస్టమర్లతో అత్యంత ఉపయోగించబడుతోందని అమెజాన్ పేర్కొంది.

గురువారం నుండి ఈ కార్డ్‌పై అంతర్జాతీయ లావాదేవీలపై ఫోరెక్స్ రుసుములను తగ్గిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రైమ్ సభ్యులకు 5 శాతం అపరిమిత క్యాష్‌బ్యాక్, నాన్ ప్రైమ్ సభ్యులకు 3 శాతం రివార్డ్స్‌ను కొనసాగిస్తోన్నట్లు అమెజాన్ పే ఇండియా డైరెక్టర్ మాయంక్ జైన్ పేర్కొన్నారు.

మరింత అగాథంలోకి రూపాయి

- డాలర్‌తో పోల్చితే 88.47కు క్షీణత



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత అగాథంలోకి జారింది. చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో 88.47కు పతనమయ్యింది. అమెరికా, భారత్ మధ్య చోటు చేసుకుంటున్న టారిఫ్ ఆందోళనలు రూపాయి విలువను చరిత్రలో ఇది వరకు ఎప్పుడు లేని కనిష్ఠ స్థాయికి పడేలా చేస్తున్నాయి. గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 36 పైసలు పతనమై 88.47కి దిగజారి.. ఆల్‌టైం కనిష్ఠ స్థాయిని చవి చూసింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.11 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.47 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 5న 88.38 కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టాయి.

రాజధానిలో ప్రపంచబ్యాంక్, ఆసియా బ్యాంక్ బృందం పర్యటన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)



రాజధాని అమరావతిలో నగర అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టు కింద అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను పరిశీలించేందుకు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం రెండ్రోజుల పర్యటిస్తుంది. ఈ నేపథ్యంలో తొలి రోజు గురువారం గెజిటెడ్ అధికారుల టైప్ 1,2, నాన్ గెజిటెడ్ అధికారుల నివాస సముదాయాలు, ఇ - 6 ట్రంక్ రోడ్, ఎల్‌పిఎస్ జోన్ 2ఎ, 1ఎ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించింది. నిర్మాణ పనుల పురోగతి, నిర్మాణ ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుత్తేదారు సంస్థలు అందిస్తున్న మౌలిక వసతులను గురించి బృందం సభ్యులు ఆరా తీశారు. సిఆర్‌డిఎ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. అనంతవరంలో ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నర్సరీ, తుళ్లూరులోని సిఆర్‌డిఎ స్కిల్ హబ్ ప్రాంగణం, ఎన్ -9 ట్రంక్ రోడ్ పనులు, శాఖమూరు, నీరుకొండ రిజర్వాయర్‌ల వద్ద పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలను పరిశీలించారు. బృందంలోని ప్రతినిధులు ఆయా సైట్‌లలో నిర్మాణ పనుల పురోగతి, పర్యావరణ, సామాజిక రక్షణ ప్రమాణాలు అమలులో ఉన్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని అధఙకారులు తెలిపారు. రెండోవ రోజు శుక్రవారం విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో కమిషనర్ కన్నబాబుని కలిసి రాజధానిలో పర్యావరణ సామాజిక అంశాల అమలుపై చర్చిస్తారని, దానికి ముందుగా నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాజధాని పనుల పురోగతిపై మాట్లాడతారని చెప్పారు.

సంపాదకీయం

నేపాల్ పరిణామాలు

మన పొరుగుదేశం నేపాల్‌లోని పరిణామాలు ఆ దేశ పాలకులకే కాదు; ఏ దేశ పరిపాలకులకైనా గుణపాఠాలు. ప్రజల అవసరాలను, ఆకాంక్షలను పట్టించుకోకుండా, ఆఖరికి వారి నిరసన స్వరాల మీద కూడా నిర్బంధం ప్రయోగిస్తే ... అసంతృప్తీ, ఆగ్రహమూ ఏ రీతిన పెచ్చరిల్లుతాయో చెప్పటానికవి ఉదహరణీయ ఉదంతాలు. పెనంలోంచి పొయ్యిలో పడ్డం చందంగా ... కొన్ని తిరోగామిశక్తులు మళ్లీ రాచరిక పాలన కావాలని రచ్చకు దిగటం ప్రమాదకర పరిణామం. కాగా, జెన్ జెడ్ ఆందోళనకారులు మాత్రం తాత్కాలిక ప్రధానిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కి, విద్యుత్ బోర్డు మాజీ ఎమ్డీ కుల్మన్ ఘీసింగ్ పేర్లపై తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. ఏదేమైనా తక్షణమే నేపాల్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలి. సుదీర్ఘ కాలం పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువలనూ పరిరక్షించుకునేందుకు ఆ దేశ యువతా, ప్రజాస్వామికవాదులూ కంకణబద్ధులై ఉండాలి.

నేపాల్ మన పక్క దేశం మాత్రమే కాదు; చారిత్రికంగా, సాంస్కృతికంగా మనతో ఎంతో అవినాభావ సంబంధం ఉన్న దేశం. అనేక ఏళ్ళ పాటు రాచరిక పాలనలో మగ్గి, ప్రజల నిరంతర పోరాటంతో 2006లోనే ప్రజాస్వామిక దేశంగా అవతరించింది. అయితే, అనేక కారణాల చేత పూర్తిస్థాయిలో ప్రజాస్వామిక వ్యవస్థలు వేళ్లూనకముందే తరచూ రాజకీయ సంక్షోభాలు సంభవించాయి. ఏదొక రూపంలో అస్థిరత, అస్తవ్యస్త పరిస్థితీ వెంటాడుతూ వచ్చింది. భూ విస్తీర్ణంలో కేవలం 20 శాతమే వ్యవసాయయోగ్యంగా ఉన్న నేపాల్‌లో పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయమే ఇప్పుడు చాలామందికి ఉపాధి. మూడు కోట్ల మంది జనాభాలో 15 – 24 ఏళ్ల మధ్య వయస్సు గల యువతలో 20.81 శాతం నిరుద్యోగిత నమోదై ఉంది. బతుకు తెరువుకు ఏటా 8 వేల మంది వరకూ ఇతర దేశాలకు వలస పోవటం అనివార్యంగా మారింది. మరొక పక్క పాలకుల్లో అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెచ్చు పెరిగాయి. వారి సంతతి విదేశాల్లో చదువూ, విహారాల పేరిట విలాస జీవితాలను అనుభవిస్తున్నారన్న ప్రచారం కూడా జన సామాన్యంలో సాగింది. సామాన్యులు, సంపన్నుల మధ్య ఆర్థిక అంతరాలు తీవ్రంగా పెరగటం; ఉద్యోగ ఉపాధి అవకాశాలు దారుణంగా క్షీణించటం ... జెన్ జెడ్ యువతలో తీవ్ర అసంతృప్తిని రగిల్చింది. వారి అభిప్రాయాల వెల్లడికి, అసంతృప్తి వెళ్లబోతకు సోషల్ మీడియా ఒక వేదికగా మారింది. అలాంటి కిటికీని ప్రధాని కె.పి.శర్మ ఓలి ప్రభుత్వం ఈనెల 4వ తేదీన 26 అమెరికన్ సోషల్ మీడియా యాప్‌లపై నిషేధం విధించటం ద్వారా మూసివేసింది. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టా వంటి అమెరికా ప్రసార మాధ్యమ సంస్థలు తమ చట్టాలను బేఖాతరు చేస్తుండడం వల్లే ఈ చర్య అని ప్రభుత్వం వివరణ. కానీ, సోషల్ మీడియాపై నిషేధం యువత పెద్దఎత్తున రోడ్ల మీదికి రావటానికి ఉత్ప్రేరకమైంది. పేరుకుపోయిన అసంతృప్తి ఒక్కసారిగా వెల్లువలా బద్దలైంది. దానిని నియంత్రించే ప్రయత్నంలో పోలీసులు కాల్పులు జరపటం, దాదాపు 20 మంది యువకులు చనిపోవటం మరిన్ని అవాంఛనీయ పరిణామాలకు దారితీసింది. మంత్రుల మీద, రాజకీయ నాయకుల మీదా భౌతిక దాడులు జరపటం, నేతల ఇళ్లకు నిప్పు పెట్టటం, అలా రాజేసిన మంటల్లోనే మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రార్కర్ ప్రాణాలు కోల్పోవటం దిశానిర్దేశం లేని దురాగ్రహ పర్వానికి ఆనవాళ్లు. 77 జిల్లాల్లో జైళ్ల నుంచి సుమారు 13 వేల మంది ఖైదీలు తప్పించుకుపోయారు. రాజకీయ నాయకులు ప్రాణాలరచేతిలో పెట్టుకొని సైనిక రక్షణ కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

దేశం ఇప్పుడు సైన్యం నియంత్రణలో ఉంది. రాజధాని ఖాట్మాండు సహా అనేక పట్టణాల్లో ఇప్పటికీ కర్ఫ్యూ కొనసాగుతోంది. ఎన్నేళ్లుగానో మాటు వేసుకు కూర్చున్న రాచరిక వాదులు, ప్రతీఘాత శక్తులు పెచ్చరిల్లకముందే ప్రజాస్వామిక వాదులు వ్యవస్థ పునరుద్ధరణకు పూనుకోవాలి. ప్రజల ఆశలను, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని, పాలన సాగించాలి. ఇంత పెద్దఎత్తున ఎగసిన నిరసనలు, ఆందోళనలు అందరి బాగును కోరే వ్యవస్థల నిర్మాణానికి దోహదపడాలి తప్ప– ఫ్యూడల్ నిరంకుశ శక్తుల పునరుజ్జీవానికి కాదు. ఈ నేపథ్యంలో బుధవారం భారత అత్యున్నత న్యాయస్థానం మన రాజ్యాంగ వ్యవస్థల ప్రాధాన్యంపై చేసిన వ్యాఖ్య గమనార్హం. వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఏకపక్షంగా వ్యవహరిస్తే, ఆర్థిక అంతరాలను పెంచే విధానాలను అనుసరిస్తే ... అది దేశానికి ప్రమాదకరం అన్నది సుప్రీంకోర్టు నేపాల్ పరిణామాల ప్రస్తావన ద్వారా మన పాలకులకు చేసిన హెచ్చరిక!

మహనీయుల మాట



విజ్ఞానాన్ని పొందాలనుకుంటే దానికై పరిశ్రమించక తప్పదు. శ్రమ పడటం అన్నది జీవన సూత్రం.

- జాన్ రస్కిన్,
బ్రిటిష్ రచయిత, తత్వవేత్త.

సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

సందర్భం



బి.వి. రాఘవులు

కామ్రేడ్ సీతారాం ఏచూరి మనకు దూరమై అప్పుడే సంవత్సరం అయ్యింది. దేశ రాజకీయ రంగంలో ఆయన లేని వెలితి స్పష్టంగా కన్పిస్తున్నది. భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం లపై ఆర్‌ఎస్‌ఎస్, దాని పనుపున నడుస్తున్న బిజెపి కేంద్ర సర్కారు తీవ్రమైన దాడి చేస్తున్న తరుణంలో, దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యపర్చి ముందుకు తీసుకుపోవడంలో సీతారాం కృషి అసమానమైనది. ఇప్పుడు ఆయన మన మధ్య లేకపోయినా ఆ వరవడిని మరింత పటిష్టంగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

భారతీయత భావనకు పునాది మన సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వంలో ఉందని సీతారాం ప్రగాఢంగా నమ్మారు. ఆయన రచనలలో, ఉపన్యాసాలలో ఈ అంశాన్ని తప్పకుండా ప్రస్తావించేవారు. ఈ సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు ధ్వంసం చేస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి అధికారాన్ని, రాజ్య వ్యవస్థలను ఉపయోగించుకుని మరింత వినాశకరమైన దాడులు చేస్తున్నది. దీన్ని ఎదిరించి మన సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం మన దేశ పురోభివృద్ధికి, అంతిమంగా సోషలిస్టు సమాజ సాధనకు అవసరం అన్న స్పృహతోనే ఫాసిస్టు హిందూత్వ మతోన్మాద శక్తులను నిరంతరం సీతారాం ఎదుర్కొన్నారు. అయితే ఆ పని ఇంకా అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

భారతీయ భావనను (ఐడియా ఆఫ్ ఇండియా) తరతరాల చరిత్ర తీర్చి దిద్దింది. ఈ భావన ప్రజల నిత్య జీవితానుభవం నుండి పోరాటాలు, ఉద్యమాలు సృష్టించిన ఐకమత్యం నుండి, అది సృష్టించిన ఉమ్మడి విలువలు, ప్రయోజనాల నుండి ఆవిర్భవించింది. ఈ భావనే మన రాజ్యాంగం ఇండియా "భారత్" అన్న నిర్వచనంలో క్రోడీకరించింది. నేడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ శక్తులు సర్వ సాధారణ ఆమోదం పొందిన ఈ భావనను వమ్ముజేస్తున్నాయి. దేశ చరిత్రను వక్రీకరించి, కట్టుకథలను వ్యాప్తిజేసి, భారతీయ భావనకు వికృత రూపాన్ని ఇవ్వడానికి పూనుకున్నాయి.

భారతీయ భావనకు కీలకం 'భిన్నత్వంలో ఏకత్వం'. ఎన్నో మతాలు, భాషలు, మాండలిక, ప్రాంతీయ వ్యత్యాసాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, వేషభాషలు, ఆహారపు అలవాట్లు, పండగలు, పబ్బాలు, పెళ్లి పద్ధతులు, తెగలు, కులాలు జీవన పద్ధతులు కలగలిసి జీవించే కోట్లాది ప్రజలున్న దేశం మనది. ఇన్ని వ్యత్యాసాలున్నా, ఈ వైవిధ్యం కొన్ని సందర్భాలలో దేశ సమైక్యతకు, ప్రజల సంఘీభావానికి పరీక్షలు పెడుతున్నా మనమంతా భారతీయులం/ఇండియన్స్ అన్న ఆలోచన ప్రజలలో బలంగా వేళ్ళూనుకున్నది. కాని బిజెపి, ఇతర మతతత్వ శక్తులు ఈ విశాల భారతీయతా భావనకు బదులుగా ఒక సంకుచిత, మత భావనను చొప్పించి దేశ సమైక్యతకు చిచ్చు పెడుతున్నాయి.

ఈరోజు ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ పుట్టినరోజు సందర్భంగా మన ప్రధాని నరేంద్ర మోడీ మీడియాకు విడుదలజేసిన ప్రశంసా వ్యాసంలో మోహన్ భగవత్ "ఏక్ – భారత్ – శ్రేష్ట భారత్' భావనను విశ్వసిస్తారు. ఇండియా వైవిధ్యాన్ని, విభిన్న సంస్కృతుల, సాంప్రదాయాల గొప్పదనాన్ని గౌరవిస్తారు. 'వసుధైక కుటుంబం సూత్రం ఆయనకు స్ఫూర్తి" అని ప్రధాని మోడీ రాశారు. భగవత్ పట్ల ఆయన భక్తిప్రపత్తులు ప్రకటించుకోవడం ఆయన అభీష్టం. కాని ఆయన ఆర్‌ఎస్‌ఎస్ గురించి, దాని అధినేత గురించి చెప్పిన అభిప్రాయాలు నోరు నవ్వుతుంటే నొసలు వెక్కిరిస్తున్నట్లున్నాయి. ఏ విలువలైతే ఆర్‌ఎస్‌ఎస్‌లో నలుసంతైనా కన్పించవో, వాటిని ఆర్‌ఎస్‌ఎస్ అధినేతలో మనకు చూపించి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం మోడీ చేశారు. వారిరువురికీ ఏక్ భారత్ అంటే ఒకే మతం – అంటే హిందూ మతం, ఒకే భాష – అంటే సంస్కృతం/ హిందీ, ఒకే సంస్కృతి – అంటే బ్రాహ్మణవాద అగ్ర కుల జీవన విధానం – ఇదీ వైవిధ్యం మీద వారి ప్రేమ, ఏక్ భారత్ అంటే వారి అర్థం.

మన దేశం ప్రాచీన కాలం నుండి హిందూ మత ప్రాతిపదికన నడిచిందని, అందువలన మన దేశాన్ని హిందూ మత ప్రాతిపదిక రాజ్యంగా ప్రకటించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ పరివార్ శక్తులు పనిజేస్తున్నాయి. ఈ ప్రయత్నాలకు అడ్డంగా

మన దేశంలో ఎన్నో త్యాగాలతో, జీవితానుభవంతో సాధించుకున్న 'లౌకిక భావనను' వమ్ముగావడాన్ని సహించడం మన దేశ చరిత్రకు అపచారం అవుతుంది. దేశ సమైక్యతకు విఘాతం కల్గుతుంది. అందుకే లౌకిక విలువలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం మన అందరి మీద ఉన్నది. సోషలిజం కోసం జరిగే పోరాటంలో లౌకిక విలువలను కాపాడుకోవడం, ఒక ముఖ్య భాగం అని నమ్మి, జీవితాంతం కృషి చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఆ కృషిని కొనసాగించడమే మనం అర్పించగల నిజమైన నివాళి.



నేడు కా॥ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి

భారతీయత భావనకు పునాది మన సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వంలో ఉందని సీతారాం ప్రగాఢంగా నమ్మారు. ఆయన రచనలలో, ఉపన్యాసాలలో ఈ అంశాన్ని తప్పకుండా ప్రస్తావించేవారు. ఈ సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు ధ్వంసం చేస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి అధికారాన్ని, రాజ్య వ్యవస్థలను ఉపయోగించుకుని మరింత వినాశకరమైన దాడులు చేస్తున్నది. దీన్ని ఎదిరించి మన సమ్మిశ్రిత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం మన దేశ పురోభివృద్ధికి, అంతిమంగా సోషలిస్టు సమాజ సాధనకు అవసరం అన్న స్పృహతోనే ఫాసిస్టు హిందూత్వ మతోన్మాద శక్తులను నిరంతరం సీతారాం ఎదుర్కొన్నారు.

ఉన్న రాజ్యాంగ మౌలిక విలువలను పథకం ప్రకారం ధ్వంసం చేస్తున్నాయి. మోడీ సారథ్యంలో గత పదకొండేళ్లలో బిజెపి ప్రభుత్వం ఈ పనిజేస్తున్నది.

'హిందూ' అన్న పదానికి ఒక మతం అర్థం ప్రాచీన కాలంలో లేదు. దానికి మతార్థం ఆధునికంగా ఇవ్వబడింది. సింధూ నదీ ప్రవాహ ప్రాంతంలో నివసించే ప్రజలకు 'సింధూ' అన్న మాటను వినియోగించారు. అయితే ఆ నాటి ఇరానియన్ అవేస్త భాషలో అది 'హిందూ'గా మారింది. దేశానికి వచ్చిన గ్రీకుల భాషలో ఇండోస్‌గా మారింది. అనంతరం దేశంలో పర్యటన జేసిన చైనీయుల భాషలో అది 'ఇంటు'గా వ్యవహరించబడింది. మధ్య యుగాలలో దేశాన్ని పరిపాలించిన, ఢిల్లీ సుల్తానుల కాలంలో పర్షియన్ భాష మూలంలో, 'హిందూస్థాన్'గా మారింది. బ్రిటీష్ వలస పాలకుల హయాంలో గ్రీకు భాషలోని 'ఇండోస్' నుండి ఇంగ్లీషు భాషలో 'ఇండియా'గా మారింది. ఈ మొత్తం పరిణామంలో ఈ మాటలకు భౌగోళిక భావం తప్ప మతార్థం ఎక్కడా లేదు.

అలాగే ఇప్పుడు మనం ఒక దేశంగా భావిస్తున్న ప్రాంతాన్ని మన పురాతన ఆధారాలు భౌగోళికార్థంలోనే పేర్కొన్నాయి. వేద కాలం నుండి గ్రంథాలు సింధూ పరీవాహక ప్రాంతం అన్న అర్థంలో 'సింధవ' అన్న మాటను వాడారు. ఆ తర్వాత అశోకుని శిలాశాసనాలలో 'జంబు ద్వీప' మాట మను ధర్మ శాస్త్రంలో ప్రయోగించిన 'ఆర్యా వర్తం' అన్న మాట, క్రీస్తు పూర్వం ఒకటవ శతాబ్దంలో 'ఖారవేలుడు' అనే పాలకుడు వేసిన శిలాశాసనంలో పేర్కొన్న 'భారత వర్ష' అన్న పదం భౌగోళిక అర్థంలోనే వినియోగించబడ్డాయి.

అలాగే 'హిందూ మతం' అన్న పద ప్రయోగం కూడా 18వ శతాబ్దం వరకు మనకు కన్పించదు. అప్పటి వరకు మతాల గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు బ్రాహ్మణం, జైన, బౌద్ధ, శ్రమణం, వైష్ణం, శైవం, ఇస్లాం, సిక్ఖిజం వంటి పదాలనే ప్రయోగించారు. కొంతమంది బ్రిటీష్ అధికారులు 'హిందూ' అన్న పదాన్ని మొట్టమొదట మత అర్థంలో ప్రయోగించడం ప్రారంభించారు. ఆ తర్వాత రాజా రామమోహన్ రాయ్ 1819లో 'హిందూయిజం' అన్న పదాన్ని వినియోగించారు. ఇప్పుడు సంఘ్ పరివార్ శక్తులు 'హిందూ మతం' భావన ప్రాచీన కాలం నుండి ఉందని అదే ప్రజల రాజకీయ, సామాజిక జీవనాన్ని నడిపించిందని, పరిపాలనను శాశించిందని చెబుతున్న అంశం చారిత్రక సత్యం కాదు.

మన దేశంలో ఎన్నో మతాలు ఉద్భవించాయి. ప్రజా జీవితంపై పెద్ద ప్రభావాన్ని చూపాయి. బలమైన, ప్రభావితమైన శక్తులుగా ఎదిగాయి. కాల గమనంలో కొన్ని బలహీనపడ్డాయి. కొన్ని చీలిపోయి ముక్కలయ్యాయి. అయినా దేశంలో ఎన్ని మతాలున్నా, ఎన్ని వాదోపవాదాలు జరిగినా, కొన్ని సందర్భాలలో మత అనుయాయుల మధ్య భౌతిక సంఘర్షణలు జరిగినా, మొత్తం మీద ఈ ఉపఖండంలో విభిన్న మతాలు, మత శాఖలు సహ జీవనం సాగించడం ప్రధాన అంశంగా ఉండేదనేది వాస్తవం. ఆ వాస్తవం, అనుభవం మీద ఆధారపడే మన స్వాతంత్ర్యోద్యమ నేతలు బ్రిటీష్ వలసవాద వ్యతిరేక పోరాటంలో ప్రజలను సమీకరించేందుకు లౌకికవాద భావనను ఆలంబనగా చేసుకున్నారు. ముస్లిం లీగు 'ఇస్లాం'ను రాజ్యానికి ప్రాతిపదిక అన్నా, హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్ లు 'హిందూ' మత ప్రాతిపదికగా జాతిని, దేశాన్ని నిర్మించాలని అన్నా, స్వాతంత్ర్యోద్యమం (దానిలో – అన్ని పాయలు, కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టు, విప్లవకారులు) ఉపఖండమంతా, వైవిధ్యభరితమైన భారత దేశాన్ని ఒకటిగా నడపాలన్నా, వలస పాలనను తుదముట్టించడానికి ప్రజలను ఐక్యం చేయాలన్నా లౌకిక ప్రాతిపదిక అవసరం అని భావించారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాణ సభలో జరిగిన చర్చల్లో, జరిగిన వాదోపవాదాల్లో ఈ భావన స్పష్టంగా కన్పిస్తుంది. ఆధునిక సమాజంలో ఏ దేశమైనా బతికి బట్ట కట్టాలంటే, ఐక్యంగా మనగల్గాలంటే, నిరంతర సంఘర్షణలతో కునారిల్లకుండా అభివృద్ధి పథంలో ముందుకు పోవాలంటే రాజ్యానికి లౌకిక పునాది ఉండాలని ప్రపంచ అనుభవం తెల్పుతున్నది.


ఆధునిక శాస్త్ర సాంకేతిక సమాచార, రవాణా రంగాలలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, వ్యాపారం, ఉత్పత్తి, పర్యాటకం, మొదలగు అన్ని రంగాలలో ప్రపంచీకరణను స్థిరపర్చుతున్నాయి. ఒకే దేశంలోనే కాదు అన్ని దేశాల మధ్య ప్రజలు వలస పోవడం పెరిగిన నేపథ్యంలో దేశాలన్నింటిలో వైవిధ్యం ఇంకా తీవ్రమవుతున్నది. ఈ స్థితిలో ఏ రాజ్యమైనా స్థిరంగా, ఒడిదుడుకులు లేకుండా పురోగమించాలంటే లౌకిక భావన ఆలంబన తప్పదు.

మన దేశంలో ఎన్నో త్యాగాలతో, జీవితానుభవంతో సాధించుకున్న 'లౌకిక భావనను' వమ్ముగావడాన్ని సహించడం మన దేశ చరిత్రకు అపచారం అవుతుంది. దేశ సమైక్యతకు విఘాతం కల్గుతుంది. అందుకే లౌకిక విలువలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం మన అందరి మీద ఉన్నది. సోషలిజం కోసం జరిగే పోరాటంలో లౌకిక విలువలను కాపాడుకోవడం, ఒక ముఖ్య భాగం అని నమ్మి, జీవితాంతం కృషి చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఆ కృషిని కొనసాగించడమే మనం అర్పించగల నిజమైన నివాళి.

(వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు)

ఇజ్రాయిల్ దుర్మార్గం

వ్యాఖ్య



దాదాపు 75 సంవత్సరాలకు పైగా పాలస్తీనాను ఆక్రమించుకున్న ఇజ్రాయిల్ గాజాలో ప్రతిరోజూ జరుపుతున్న మారణహోమం జాతి నిర్మూలనే (జినోసైడ్) అని ప్రపంచం ఇప్పుడు గుర్తిస్తోంది. నిద్రించడానికి కూడా స్థలం లేని లక్షలాది మంది ప్రజలు గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న క్రూరమైన బాంబు దాడుల బారిన పడుతున్నారు. గడిచిన 23 నెలల కాలంలో 64 వేల మందికి పైగా పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ ప్రత్యక్ష దాడుల్లో మృత్యువాత పడ్డారు. వీరిలో పదివేల మందికి పైగా పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మంగళవారం ఖతార్‌పై ఇజ్రాయిల్ చేసిన దాడి ఆ దేశ దుర్మార్గానికి నిదర్శనం. అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోకుండా, పాలస్తీనా నాయకులను చంపడమే లక్ష్యంగా ఆ ప్రాంతంలోని ఇతర దేశాలపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు ఇది తాజా ఉదాహరణ. 10 నెలల క్రితం అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుకు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దీంతో ఇజ్రాయిల్‌కు సన్నిహితంగా ఉండే పలు పాశ్చాత్య దేశాలు కూడా ఆ దేశానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నాయి. కనీసం చర్యలు తీసుకుంటున్నట్లుగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నాయి. వీటిలో కొన్ని దేశాలు ఇజ్రాయిల్ మంత్రులపై ఆంక్షలను, నిషేధాలను సైతం ప్రకటించాల్సి వస్తోంది. కానీ, మన దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మాత్రం ఇవేమీ పట్టడం లేదు. ఇజ్రాయిల్ దౌష్ట్యానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఆ దేశంతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మోడీ సర్కారు నిర్ణయించింది. దీనిలో భాగంగానే ఐక్యరాజ్యసమితి సైతం గౌరవించని ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్‌కు మన దేశం స్వాగతం పలకడాన్ని చూడాల్సి ఉంటుంది. ఈ పర్యటనలో భాగంగానే ఇజ్రాయిల్‌లో పెట్టుబడులకు సంబంధించిన ఒక ఒప్పందాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం చేసుకుంది. పాలస్తీనా రాజ్యాన్ని, పాలస్తీనియన్ ప్రజల ఉనికిని కూడా గుర్తించడానికి నిరాకరించిన స్మోట్రిచ్‌ను అంతర్జాతీయ సమాజం ఒక నేరస్తుడిగా, తీవ్రవాద జాత్యహంకారిగా పరిగణిస్తోంది. అటువంటి వ్యక్తితో, దుష్ట రాజ్యానికి లబ్ధి కలిగించేలా ఒప్పందం చేసుకోవడంతో అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ట మసకబారింది.


వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ స్థిరనివాసులను పాలస్తీనియన్లపై హింసకు ప్రేరేపించినందుకు బ్రిటన్, కెనడా వంటి పాశ్చాత్య దేశాలు అతన్ని నిషేధించాయి. 20 సంవత్సరాల క్రితం గాజా నుండి యూదు సెటిలర్లను ఇజ్రాయిల్ ఉపసంహరించుకోకుండా నిరోధించడం కోసం ఉగ్రవాద చర్యకు సిద్ధమౌతున్న అతనిని ఇజ్రాయిల్ పోలీసులే అరెస్ట్ చేశారు. అతనితో కలిసి ఒప్పందం చేసుకోవడం ద్వారా ఇజ్రాయిల్ మిత్రదేశాలు కూడా తిరస్కరించే నేరపూరిత చర్యను భారత్ ఆమోదించినట్లైంది. ఇది మొదటి నుండి సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయం కలిగిన భారత ప్రజలను అవమానించడమే!

ఐక్యరాజ్యసమితి 80వ వార్షిక సమావేశం మంగళవారం న్యూయార్క్‌లో ప్రారంభమైంది. ఈ నెల 28వ తేది వరకు కొనసాగే ఈ సమావేశం చివరి వారంలో ప్రపంచ స్థాయి నాయకులు హాజరయ్యే జనరల్ అసెంబ్లీ జరుగుతుంది. ఆలోగా గాజాపై దాడులను ఆపాలని లేని పక్షంలో పాలస్తీనాను అధికారికంగా గుర్తిస్తామని ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు హెచ్చరించాయి. దీనికి మరిన్ని పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకుంటామని ఇజ్రాయిల్ బెదిరింపులకు దిగడంతో యూరప్ దేశాల్లో సామాన్య ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి అనేక దేశాల్లో ఇజ్రాయిల్ దురాగతాలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. పాలస్తీనా ప్రజలతో సంఘీభావం పెరుగుతోంది. ప్రజల నుండి వ్యక్తమవుతున్న ఈ ఆగ్రహం కారణంగానే అనేక పాశ్చాత్య దేశాలు ఇష్టం లేకపోయినా తమ వైఖరిని మార్చుకున్నట్టు పైకైనా కనపడాల్సి వస్తోంది. మన దేశం మాత్రం దీనిని గుర్తించడానికి నిరాకరిస్తుండటం దారుణం. ఇటీవల పరిణామాలతో ఆగ్రహంగా ఉన్న అమెరికాను శాంతింప చేయడానికి ఇజ్రాయిల్‌తో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోవడం భారత ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. ఇవి కార్పొరేట్లకు మాత్రమే లబ్ధి చేకూరుస్తాయి.

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

బీహారీ బేహారుల బేరాల జోరు

అటు ఇటు



ఢిల్లీ దారి బీహార్ గుండా అన్నట్టు త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో సామదాన భేద దండోపాయాలతో పీఠం పట్టుకోకపోతే మిగిలిన చోట్ల, తర్వాత జాతీయంగా కూడా రాజకీయ గండం తప్పదన్న భయం బిజెపి నేతలది. గత రెండు శాసనసభ ఎన్నికల్లోనూ మొదట ఓడిపోయి తర్వాత రాజకీయ శకుని మామ లాంటి సిఎం నితీశ్ కుమార్ కుటిల నీతి వల్లనే బతికి బట్ట కట్టారాయె. అందుకోసమే సీట్లు తక్కువైనా ఆయనకు ఆ పదవి అప్పగించి తెర వెనక రాజకీయాలు నడిపిస్తున్నారు. కాని ఈసారి ఇండియా బ్లాక్ ముందు నుంచే కలసి కట్టుగా అడుగులు వేస్తున్నది. సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తి కాకున్నా ఏదో విధంగా ఉమ్మడిగా నిలవకపోతే మొదటికే మోసమన్న అవగాహన బలంగా వుంది. ఇదే అదునుగా నితీశ్ తమ జెడియు కు అధిక సీట్లు కావాలని బహిరంగ పేచీలు పెడుతున్నారు.

ఆల్ రోడ్స్ లీడ్ టు రోమ్ అనే ప్రాచీన కాలపు సామెత లాగా ప్రస్తుతం మోడీ సర్కారు ఏమి చేసినా అది బీహార్‌కే దారితీస్తుంది. ఢిల్లీ దారి బీహార్ గుండా అన్నట్టు త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో సామదాన భేద దండోపాయాలతో పీఠం పట్టుకోకపోతే మిగిలిన చోట్ల తర్వాత జాతీయంగా కూడా రాజకీయ గండం తప్పదన్న భయం బిజెపి నేతలది. గత రెండు శాసనసభ ఎన్నికల్లోనూ మొదట ఓడిపోయి తర్వాత రాజకీయ శకుని మామ లాంటి సిఎం నితీశ్ కుమార్ కుటిల నీతి వల్లనే బతికి బట్ట కట్టారాయె. అందుకోసమే సీట్లు తక్కువైనా ఆయనకు ఆ పదవి అప్పగించి తెర వెనక రాజకీయాలు నడిపిస్తున్నారు. కాని ఈసారి ఇండియా బ్లాక్ ముందు నుంచే కలసి కట్టుగా అడుగులు వేస్తున్నది. సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తి కాకున్నా ఏదో విధంగా ఉమ్మడిగా నిలవకపోతే మొదటికే మోసమన్న అవగాహన బలంగా వుంది. ఇదే అదునుగా నితీశ్ తమ జెడియు కు అధిక సీట్లు కావాలని బహిరంగ పేచీలు పెడుతున్నారు. తానే మళ్లీ సిఎం అవుతానని సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బిజెపి అటు ఇండియాను ఎదుర్కోవడంతో పాటు రేపు నితీశ్‌ను కూడా దెబ్బ తీయాలనే రీతిలో పావులు కదుపుతున్నది. ఇ.సి ద్వారా 'సర్' ప్రయోగించి భంగపడింది. ఇందుకే తాజా కేంద్ర మంత్రిమండలి మోడీ అధ్యక్షతన సమావేశమై ప్రత్యేకంగా బీహార్‌కు ఇన్‌ఫ్రా, రైల్వే రంగాల్లో 7600 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. సెంటిమెంటల్‌గా ఆపరేషన్ సిందూర్ ప్రారంభం, మొన్న మరో కార్యక్రమం కూడా అక్కడే మొదలెట్టింది. పాచికలు బావున్నాయి కాని వచ్చే పరాజయం ఆపగలవా? 2015లో ఎంతివ్వమంటారు అని వేలం పాడి ఏకంగా లక్ష కోట్ల ప్యాకేజీ ప్రకటన ఆపగలిగిందా? ప్రకటనల వెనక నటనలు ఎవరికి తెలియనివి?

ఈ బంధం దృఢమైనది

మంత్రి నారా లోకేష్ ఇటీవల ఢిల్లీ పర్యటనలో రాజ్‌దీప్ సర్దేశాయ్‌కి ఇంటర్వ్యూ ఇస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ పండితులను ఆకర్షించాయి. తండ్రిని మించిన తనయుడు అని ఆయన అభిమానులు కొందరు ఇద్దై పోయారు కూడా. ఏమంటే 2029లో కూడా తాము బిజెపితో కలిసే వుంటామని లోకేష్ ఆ ఇంటర్వ్యూలో చెప్పేశారు. గతంలో మీ సిఎం గారు మోడీపై దాడి చేశారు కదా అంటే మనుషులన్నాక కొన్ని తప్పులు చేస్తుంటారు కదా అని సంజాయిషీ కూడా ఇచ్చేశారు. ఈ రెండు ప్రకటనలూ చూశాక చంద్రబాబు ఇంత సూటిగా చెప్పి వుండేవారు కాదని పరిశీలకుల మాట. పదిహేనేళ్లు కలిసే వుంటామని పదేపదే ప్రకటిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటల తరహాలోనే లోకేష్ మాట్లాడారంటే బిజెపితో ఆయన బలంగా సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారని వారు చెబుతున్నారు. నిజానికి చంద్రబాబు జైలులో వుండగా పెద్దమ్మతో సహా అమిత్ షా ను కలుసుకున్న సమయంలోనే లోకేష్ ఈ బంధానికి పునాదులు వేశారట. ఇటీవలి కాలంలో ఢిల్లీ పదేపదే వెళ్లి మోడీని అమిత్‌షా ను కలుసుకుని రావడం చూస్తూనే వున్నాం. రాష్ట్రాభివృద్ధికి నిధుల కోసం ఎన్‌డిఎ లో చేరామని చంద్రబాబు చెబుతుంటారు. కానీ అలాంటి శషబిషలు కూడా లోకేష్ పెట్టుకోలేదు. ఈ రెండు విషయాలకు సంబంధం లేదని తేల్చేశారు. దేశానికి బలమైన మోడీ నాయకత్వం కావాలి గనకే జట్టు కట్టామని సమర్థించుకున్నారు. ఇదే సమయంలో వైసిపి ఎంపీలు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌కు ఓటు వేయడమేగాక దాన్ని విపరీత ప్రచారంతో ప్రకటించుకున్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ ఓటింగుకు దూరంగా వుండిపోయింది. ఏతావాతా మూడు పార్టీలూ మోడీ కనుసన్నల్లోనే వున్నాయని తెలిసిపోవడం లేదూ?

చావడాలెందుకు?

వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నంత కాలం మీడియాను దరికి రానివ్వలేదు. మాజీ అయ్యాక మాత్రం అడపా దడపా సుదీర్ఘ మీడియా గోష్టులు జరుపుతున్నారు. కూటమి ప్రభుత్వం పొరబాట్లనూ విధానాల తప్పులనూ చెప్పడంలో తప్పేమీ లేదు. ప్రతిపక్షంగా అది ఆయన బాధ్యత కూడా. అయితే ఈ మాటలే శాసనసభకు వెళ్లి చెప్పొచ్చుకదా అని ఎవరైనా అంటారు. హోదా ఇస్తే వస్తామని ఆయన అనడం, పదో వంతు సీట్లు లేవని సమాధానం అన్నీ తెలిసినవే. సభలు జరిగే సమయంలోనే వివరంగా మీడియాకు చెబితే ప్రజల దృష్టికి వస్తాయనేది జగన్ లాజిక్. ఈ క్రమంలోనే తాజా సమావేశంలో యూరియా కొరత, మెడికల్ కాలేజీలు ఆరోగ్యశ్రీ ప్రైవేటీకరణ తదితర విషయాలు మాట్లాడారు. ఈ సర్కారు పిలుపుపై ఎవరైనా బిడ్డింగ్‌లో పాల్గొన్నా తాము రాగానే రద్దు చేస్తామని ముందస్తు హెచ్చరిక కూడా చేశారు. అయితే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకిస్తే నష్టం లేదని చంద్రబాబు నుంచి లోకేష్ తదితర మంత్రుల వరకూ సమర్థించుకోలేక సతమతమవుతున్నారు. ఈ రెండు అంశాలను విమర్శ చేయడంలో తప్పేం లేదు. కాకపోతే ఇక్కడే జగన్ మార్క్. యూరియా ఇవ్వలేకపోతే బావిలో దూకి చావొచ్చు కదా అని ఒకటికి రెండు సార్లు రెట్టించడం అవసరమా? ఇలాంటి మాటలతో అసలు చర్చ పక్కదోవ పట్టడం ఒకటైతే వృథా వివాదాలు పెరిగిపోవడం మరోటి. ఎవరు ఎక్కువ తిట్టారు, బూతులు బాగా వాడారు పోటీలాగా అవతలివారు మళ్లీ ఇంతకన్నా తీవ్రమైన దాడులకు దిగుతారు. ఏడాది తర్వాతనైనా ప్రజల సమస్యలపై వైసిపి కార్యాచరణ చేపడితే మంచిదే కానీ జనాకర్షణ కోసం, సంచలనం కోసం కోరి వివాదాస్పద వ్యాఖ్యలతో రెచ్చగొట్టుకోవడం ఎందుకు అధ్యక్షా?

– పీపీ

- క్వాంటమ్ టెక్నాలజీ అనేది భవిష్యత్‌లో చాలా అద్భుతమైన ఫలితాలను ఇస్తుందని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. గురువారం అనంతపురం జెఎన్‌టియు ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వాలి హ్యాకథాన్ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు.

టమోటా ధర పతనం..!

- మార్కెట్‌లో కిలో రూ.2
- బహిరంగం మార్కెట్లో రూ.20
- గిట్టుబాటు కాదంటూ రైతులు ఆందోళన

ప్రజాశక్తి-పత్తికొండ (కర్నూలు)

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లో రోజు రోజుకు టమోటా ధర పూర్తిగా పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుచేసిన పంట చేతికొచ్చే సమయానికి ధర లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత పది రోజుల కిందట ఆశాజనకంగా ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు గురువారం రోజు సుమారు 250 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారస్తులు కిలో టమోటా రూ.20 అమ్ముతున్నారు. టమోటా మార్కెట్లో కిలో రూ.2 నుంచి రూ.5 లోపే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.10 గిట్టుబాటు ధర కూడా లభించడం లేదంటూ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వ్యాపారస్తులు రైతులను నట్టేట ముంచుతూ ఇష్టానుసారంగా కొనుగోలు చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జతబాక్స్ 50 కిలో రూ.60, రూ.80 మించకుండా కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కోత కోసి మార్కెట్ తెచ్చిన రవాణా చార్జీలు కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా టమోటా పంట సాగు చేయడానికి సుమారు రూ.60 వేల వరకు పెట్టుబడి ఖర్చు వస్తుంది. రాబోయే రోజుల్లో మార్కెట్లో ధరలు పతనమైతే సాగుచేసిన పంటలకు అప్పులు కూడా తీర్చలేమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారస్తులు టమోటా కొనుగోలు చేసి హైదరాబాద్, మహారాష్ట్ర ,వరంగల్, అదిలాబాద్ , రంగారెడ్డి ,తమిళనాడు మహానగరాలకు సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సరుకు అమ్ముడు పోవడం లేదంటూ వ్యాపారస్తులు అంటున్నారు. టమోటా పంట వర్షానికి తడవడంతో టమోటాలు నాణ్యత తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు లేనప్పుడు టమోటా కొనుగోలు చేసే తీవ్రంగా నష్టపోతామంటూ వ్యాపారులు తెలిపారు. వర్షాలు, పండగలు వచ్చినప్పుడల్లా టమోటా ధర పతనమవుతుందని రైతులు చెబుతున్నారు. కనీసం గిట్టుబాటు ధరతోనైనా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కూలి, రవాణా ఖర్చులు రావడం లేదు

మూడు ఎకరాలలో టమోటా పంటను సాగు చేశాను. రెండో సారి కోత కోసి 8 బాక్సులు మార్కెట్ కు తీసుకొచ్చాను. 25 కిలో జత 50 కిలోలను రూ. 60కి వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. కూలి రవాణా ఖర్చులు కూడా రావడం లేదు.

- రైతు మన్సూర్, గిరిగెట్ల గ్రామం, తుగ్గలి మండలం

రేషన్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోండి

- వచ్చే నెల 31తేదీ వరకూ అవకాశం
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులను సరిచేసుకునేందుకు వచ్చే నెల 31వ తేదీ వరకూ అవకాశం కల్పించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇందుకోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చే వారం నుంచి 'మనమిత్ర' వాట్సాప్‌లోను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. విజయవాడలోని కానూరులో సివిల్ సప్లైస్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆధార్ సమాచారం ఆధారంగానే స్మార్ట్ రేషన్ కార్డులు ముద్రించినట్లు తెలిపారు. ఆధార్ కార్డుల్లో పేర్లు, చిరునామాల మార్పులు చేసుకోకపోవడం వల్ల కొందరి కార్డుల్లో వివరాలు తప్పులు దొర్లాయని పేర్కొన్నారు. నూతన సాంకేతికతతో క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులను కొన్ని చోట్ల 95 శాతం, మరికొన్ని చోట్ల 85 శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. నాలుగు విడతల్లో 1.45 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రేషన్ తీసుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆయా షాపు వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకురావచ్చన్నారు. వచ్చే నెల 31వ తేదీ వరకూ స్మార్ట్ రేషన్ కార్డులు ఉచితంగా పంపిణీ చేస్తామని, నవంబరు 1 నుంచి నామినల్ ఫీజు రూ.35 చెల్లిస్తే కార్డులు పోస్టులు ఇంటికే పంపిస్తామని తెలిపారు. వరుసగా 3 నెలలు రేషన్ తీసుకోకపోతే కార్డు ఇన్‌యాక్టివేట్ అవుతుందని, సమీపంలోని సచివాలయానికి వెళ్లి సమాచారం ఇస్తే కార్డును యాక్టివేట్ చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో 4.42 కోట్ల మందికి ప్రతి నెలా రేషన్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 97.59 లక్షల మందికి తొలి విడతలో దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 5 కేజీల సిలిండర్‌కు బదులు 14.2 కేజీల సిలిండర్ అందిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గురువులపై 'బుక్‌లెట్' భారం

ఉపాధ్యాయులపై టిడిపి కూటమి ప్రభుత్వం మరో బరువు మోపింది. మూల్యాంకనంలో తీసుకొచ్చిన అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం గుదిబండగా మారింది. ఏడాది పొడవునా ఉండే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు, ఓఎంఆర్ షీట్లను బుక్‌లెట్‌లో పొందుపర్చాలి. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,575, ప్రభుత్వ పాఠశాలలు 956, ఎయిడెడ్ 20, ప్రైవేట్, కార్పొరేట్, పాఠశాలలు 599 మొత్తం కలిపి 1,575, జిల్లాలో విద్యార్థుల సంఖ్య 2,46,748గా ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన వీరికి అన్ని మార్కులనూ ఇందులోనే నమోదు చేయాలి. ఒక్కో పరీక్షకు సంబంధించి 100 జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంది. దీనిపై ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

నూతన ఆలోచనలతో పయనించాలి

● అమృత యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ డేలో గవర్నర్ జస్టిస్ నజీర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

నేర్చుకోవడం ఆపవద్దని, కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని విద్యార్థులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచి నేర్చుకోవడం, నిరంతర విద్యార్జన ఉండడం, తల్లిదండ్రులు, అధ్యాపకులు, తోటివారు గర్వపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లులోని అమృత యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కంటెంట్ క్రియేట్ చేయగలిగిన ఉన్నత స్థానానికి ఎదగవచ్చన్నారు. నిరంతరం నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. విద్యారంగంలో రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అమృత యూనివర్సిటీ సేవలను కొనియాడారు. 50కి పైగా దేశాల విద్యార్థులు ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మాతా అమృతానందమయి మఠం ప్రధాన కార్యదర్శి స్వామి పూర్ణామృతానంద పూరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఎస్ విజయేంద్ర, వర్శిటీ డీన్ రఘురామన్, వైస్ ప్రిన్సిపల్ శాంతమండల్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో ఉప్పొంగిన వాగులు

● ఉప్పాడలో ఎగిసిపడుతున్న అలలు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గురువారం తెల్లవారుజాము మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కలవటాల వద్ద వాగు పొంగి పొర్లుతోంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో కడప జిల్లా జమ్మలమడుగు నుంచి వచ్చే వాహనాలను నిలిపేశారు. కోవెలకుంట్ల సమీపంలో కుందూ నది, కర్నూలు నగరంలోని వక్కెర వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. హాలహర్వి, నిట్రవట్టి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ బీచ్‌లో సముద్రపు అలలు విరుచుకుపడుతున్నాయి. గురువారం ఉదయం నుంచి సుబ్బంపేట, పల్లిపేట వద్ద భారీ స్థాయిలో సముద్రపు అలలు ఎగిసి పడుతుండటంతో బీచ్ రోడ్డు ధ్వంసం అయింది. పల్లిపేట, రంగంపేటలో ఉన్న మత్స్యకార పేటలోకి సముద్రపు నీరు చొచ్చుకు వచ్చింది. దీంతో ఆయా గ్రామాల చెరువులను తలపిస్తున్నాయి. బీచ్ రోడ్డుపై వాహన రాకపోకలను నిలిపివేశారు. కోతకు గురవుతున్న బీచ్ రోడ్డును, మత్స్యకార గృహాలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మ పరిశీలించారు.

అబద్ధాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్న జగన్

- టిడిపి ఎంపి అప్పలనాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అబద్ధాలు, అవాస్తవాలు మాట్లాడారని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక జగన్ ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీల పరిస్థితి దారుణంగా ఉందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు 27 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రైవేట్ సీట్లను అమ్ముకుందని పేర్కొన్నారు.

జుగుప్సాకర భాష : వర్ల రామయ్య

వైఎస్ జగన్ జుగుప్సాకర భాష మాట్లాడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో హామీల అమలు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు, కూటమి ప్రభుత్వపు హామీల అమలుపై చర్చకు సిద్ధమా అని నిలదీశారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే భవిష్యత్తులో ఏనాడూ జగన్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు లేవని చెప్పారు. చంద్రబాబును బావిలో దూకమని వంటి తప్పుడు మాటలు మాట్లాడొద్దని హెచ్చరించారు.

ప్రజల గుండెల్లో 'సురవరం' పదిలం

- సంస్మరణ సభలో వివిధ పార్టీల నాయకులు



సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి, ప్రజల గుండెల్లో సురవరం సుధాకర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. ఇటీవల మృతి చెంది సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం నిర్వహించారు. తొలుత కార్యక్రమానికి అధ్యక్షత వహించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు, మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు, వైసిపి నాయకులు బొత్సా సత్యనారాయణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు టి.డి జనార్ధన్ తదితరులు సురవరం సుధాకర్ రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అజాత శత్రువుగా సురవరం సుధాకర్ రెడ్డి నిలిచిపోయారన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ.. సిపిఐకి గుర్తింపు తేవడంలో సురవరం తనవంతు కృషి చేశారన్నారు. నిరుపేదలు, దళిత, బలహీనవార్గాల పక్షాన నిలిచారని పేర్కొన్నారు. నేడు మతోన్మాదం, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజలపై రద్దుతున్నారని మతోన్మాదం దేశానికి ఎంతో ప్రమాదమన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి దేశ అగ్రనాయకుడిగా ఎదిగిన వ్యక్తి సురవరం అని తెలిపారు వైసిపి నాయకులు, మాజీ మంత్రి బొత్సా సత్యనారాయణ మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకూ పోరాడిన సురవరం గొప్ప కమ్యూనిస్టు నాయకుడన్నారు. ఆయన ఆశయాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ 60 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిబద్ధతతో చివరి వరకూ కొనసాగిన నాయకులు సురవరం అన్నారు. యుపిఎలో భాగస్వామిగా ఉన్నప్పుడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ.. కార్మిక, కర్షక సమస్యలపై దృషి సారించి, వారి హక్కుల సాధనకు కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించేవారిని తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రజల పట్ల నిబద్ధతతో పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను అందిపుచ్చుకుని యువత పోరాటాల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సురవరం స్ఫూర్తితో ఉద్యమ పాఠశాలను నెలకొల్పేందుకు విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు దంపతులు రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, వైసిపి నాయకులు గౌతమ్‌రెడ్డి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ప్రసాద్, జన విజ్ఞాన వేదిక నాయకులు లక్ష్మణరెడ్డి తదితరులు ప్రసంగించారు.

డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్రాలకు కేంద్రం సలహా

న్యూఢిల్లీ : వచ్చే నెలల్లో డెంగ్యూ, మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలను ముమ్మరం చేయాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా గురువారం దేశంలోని డెంగ్యూ, మలేరియా ప్రస్తుత పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించిన తరువాత ఈమేరకు ఆదేశాలిచ్చారు. వచ్చే 20 రోజుల్లోగా రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు వ్యక్తిగతంగా సమీక్షా సమావేశాలు నిర్వహించి, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయితీలు, ఇతర స్థానిక సంస్థలతో కలిసి యాక్షన్ ప్లాన్లు సిద్ధం చేయాలని, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్రం సూచించింది. 'కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఆసుపత్రులతో సహా అన్ని ఆసుపత్రుల్లోనూ తగినన్ని ఔషధాలు, డయాగ్నోస్టిక్స్, పడకలు అందుబాటులో ఉంచాలి. భారీ వర్షాల కారణంగా ఆసుపత్రులు, ఇతర ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. దోమలను నియంత్రించాలి' అని మంత్రి పేర్కొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం

- మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలను సూపర్‌హిట్‌గా అమలు చేశామని తెలిపారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ సూపర్ హిట్'సభ విజయవంతమయిందన్నారు.

అవగాహన లేని జగన్ : అచ్చెన్నాయుడు

వైద్య కళాశాలలు, రైతుల సమస్యలపై మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కనీస అవగాహన లేదని వ్యవసాయ శాఖమంత్రి క అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియా సమస్యపై జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. కొన్ని జిల్లాల్లో అకాల వర్షాల వల్ల, మరికొన్ని జిల్లాల్లో ముందుగా వర్షాలు రావడంతో యూరియాకు డిమాండ్ పెరిగిందని చెప్పారు.



నేపాల్ నుంచి విశాఖకు

- క్షేమంగా తిరిగివచ్చిన ఆంధ్ర పర్యాటకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

నేపాల్‌లో చిక్కుకున్న ఆంధ్ర పర్యాటకులు గురువారం రాత్రి విశాఖపట్నానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో ప్రత్యేక విమానంలో 144 మంది తిరిగివచ్చారు. ఎయిర్ పోర్టులో దిగిన వెంటనే తమ కుటుంబీకులను హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తాము ఎదుర్కొన్న భయానక పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు తమ కళ్లముందే తగలబడిపోయాయని, ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో దిక్కుతోచక తలోదిక్కున దాక్కున్నామని, ఎట్టకేలకు క్షేమంగా స్వరాష్ట్రానికి వచ్చామన్నారు. నేపాల్ నుంచి తిరిగి వచ్చిన వారికి విశాఖ ఎంపి శ్రీభరత్, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు స్వాగతం పలికారు. వీరందరూ తమ ఊర్లకు చేరుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన 17 మంది ప్రత్యేక విమానంలో ఖాఠ్మండ్ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకున్నారు. అక్కడ్నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో వారి వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఒడిశాకు చెందిన కొంతమందితో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ప్రాంతవాసులు వెంకట్రావు, సంతోషి లక్ష్మీ, కేదారిపురానికి చెందిన సుబ్బారావు నేపాల్ సందర్శనకు వెళ్లి చిక్కుకుపోయారు. ప్రభుత్వ చొరవతో గురువారం ఉదయం ఖాట్మాండు విమానాశ్రయానికి, అక్కడ నుంచి విశాఖపట్నానికి క్షేమంగా చేరుకున్నారు.

ఎల్గార్ పరిషత్ కేసులో గైచోర్‌కు తాత్కాలిక బెయిల్

ముంబయి : ఎల్గార్ పరిషత్ - మావోయిస్టులతో సంబంధాలు కేసులో అరెస్టయిన సామాజిక కార్యకర్త రమేష్ గైచోర్ తాత్కాలిక బెయిల్‌పై విడుదలయ్యారు. బుధవారం రాత్రి రమేష్ గైచోర్ నవీ ముంబయిలోని తలోజా జైలు నుంచి విడుదలయ్యారని జైలు అధికారులు గురువారం బాంబే హైకోర్టుకు తెలిపారు. 2017 డిసెంబర్ 31న మహారాష్ట్రలోని పూణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ పోలీసులు అరెస్టు చేసిన వారిలో రమేష్ కూడా ఉన్నారు. 2020 సెప్టెంబర్‌లో అరెస్టయిన రమేష్ గైచోర్ అనారోగ్యంతో ఉన్న 76 ఏళ్ల తన తండ్రిని కలిసేందుకు రెండు వారాలపాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, తిరస్కరించింది. ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించడంతో ఆగస్ట్ 26న మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. ట్రయల్ కోర్టు నుండి విడుదల వారెంట్ సమర్పించాల్సిందేనంటూ జైలు అధికారులు రమేష్‌ను విడుదల చేయలేదు. ఈ విషయమై ఆయన తరపు న్యాయవాది మిహిర్ దేశాయ్ బుధవారం హైకోర్టులో పిటిషన్ సమర్పించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎఎస్ గడ్కరీ నేతృత్వంలోని ధర్మాసనం.. కోర్టు ఆదేశాన్ని పాటించనందున జైలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

జైలు అధికారులు అతనిని వేధిస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో జైలు సూపరింటెండెంట్ బేషరతుగా క్షమాపణలు తెలుపుతూ గురువారం అఫిడవిట్ దాఖలు చేశారు. రమేష్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. కోర్టు ఆ అఫిడవిట్‌ను ఆమోదించి, గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ ఈ నెల 13 వరకూ రమేష్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఐదేళ్లుగా రమేష్ గైచోర్ తన తండ్రిని కలవలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది.

డియుఎస్‌యు ఎన్నికల్లో త్రిముఖ పోటీ

- అభ్యర్థులను ప్రకటించిన విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ (డియుఎస్‌యు) ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ఈ నెల 18న జరగనున్న ఈ ఎన్నికలకు ఎన్ఎస్‌యుఐ, ఎబివిపి, ఎస్ఎఫ్ఐ - ఎఐఎస్ఎ కూటమి విద్యార్థి సంఘాలు పోటీపడుతున్నాయి. తమ అభ్యర్థులను ప్రకటించి హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. క్యాంపస్‌లో విద్యార్థినుల నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు రెండు విద్యార్థి సంఘాలు అధ్యక్ష పదవికి విద్యార్థినులను పోటీకి నిలిపాయి.

క్యాంపస్ రాజకీయాల్లో "డబ్బు, కండబలానికి" వ్యతిరేకంగా తమ ప్యానెల్ "ప్రత్యామ్నాయ స్వరం" వినిపిస్తుందని వామపక్ష విద్యార్థి సంఘాల ఎస్ఎఫ్ఐ - ఎఐఎస్ఎ కూటమి పేర్కొంది. అధ్యక్ష పదవికి అంజలి, ఉపాధ్యక్షుడిగా సోహన్ కుమార్, ప్రధాన కార్యదర్శి పదవికి అభినందన ప్రత్యాషి, సహాయ కార్యదర్శి పదవికి అభిషేక్ కుమార్‌ను ఎస్ఎఫ్ఐ-ఎఐఎస్ఎ కూటమి బరిలోకి దింపింది.

కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ 17 ఏళ్ల తరువాత జోస్లిన్ నందితా చౌదరిని అధ్యక్ష పదవికి బరిలో నిలిపింది. 2008 నుంచి అధ్యక్ష పదవిని ఏ విద్యార్థినీ కైవసం చేసుకోలేదు. ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్ష పదవికి రాహుల్ ఝూన్సా, ప్రధాన కార్యదర్శి పదవికి కబీర్, సహాయ కార్యదర్శి పదవికి లవ్‌కుష్ భదానాను బరిలోకి దింపింది.



ఆర్ఎస్ఎస్, బిజెపి అనుబంధ విద్యార్థి సంఘం ఎబివిపి అధ్యక్షుడిగా ఆర్యన్ మాన్, ఉపాధ్యక్షుడిగా గోవింద్ తన్వర్, ప్రధాన కార్యదర్శిగా కునాల్ చౌదరి, సహాయ కార్యదర్శిగా దీపికా ఝూలను పోటీలో దింపింది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల బిజెపి ఎంపిలు తమ రాష్ట్రాల విద్యార్థులకు డిన్నర్ పార్టీలు ఇస్తూ ఎబివిపికి ప్రచారం చేస్తున్నారు. ఎబివిపి డబ్బులను వెదజల్లి డిన్నర్ పార్టీలను నిర్వహిస్తోంది.

ఎట్టకేలకు ఆధార్ గుర్తింపు

- దిగివచ్చిన సిఇసి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఆధార్‌ను ఓ గుర్తింపు పత్రంగా పరిగణించాలంటూ సుప్రీంకోర్టు పలు సందర్భాలలో ఆదేశాలు జారీ చేసిన మీదట కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు దిగివచ్చింది. ఓటరుగా నమోదు కావడానికి ఆధార్‌ను ఓ గుర్తింపు కార్డుగా అంగీకరించాలని జూలై 10, జూలై 28, ఆగస్ట్ 14, ఆగస్ట్ 22 తేదీలలో... నాలుగు పర్యాయాలు సుప్రీంకోర్టు సూచించింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను చేపడుతున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన 77 రోజుల తర్వాత ఓటర్ల జాబితా నుంచి అరవై ఐదు లక్షల పేర్లు గల్లంతయ్యాయి. సవరించిన ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చేందుకు ఆధార్ కార్డును 12వ గుర్తింపు పత్రంగా అంగీకరించాలని అత్యున్నత న్యాయస్థానం పదే పదే సూచించినప్పటికీ ఆ మేరకు బీహార్ సిఇఒకు ఆదేశాలు జారీ చేసేందుకు ఇసి సుముఖత చూపలేదు. చివరికి సెప్టెంబర్ 8వ తేదీన జారీ చేసిన ఆదేశాల మేరకు బీహార్ సిఇఒకు 9వ తేదీన ఉత్తర్వులు పంపింది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

అగ్రనేత మనోజ్ సహా10 మంది మావోయిస్టులు మృతి



గరియాబంద్ : అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్ర హోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతలతో దద్దరిల్లుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని గరియా బంద్‌లో గురువారం జరిగిన ఆపరేషన్‌లో పదిమంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కోటి రూపాయల రివార్డు ఉన్న మావోయిస్టు అగ్రనేత మనోజ్ అలియాస్ మోడెమ్ బాలకృష్ణ కూడా మరణించినట్లు భద్రతా బలగాలు తెలిపాయి. మోడెమ్ మృతి తమ విజయమని భద్రతా దళాలు పేర్కొంటున్నాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. గరియాబంద్ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేత బాలకృష్ణ ఉన్నట్టు నిర్ధారించాక.. ఆపరేషన్ నిర్వహించినట్టు భద్రతా బలగాలు తెలిపాయి. మనోజ్ అలియాస్ మోడెమ్ బాలకృష్ణను కేంద్ర కమిటీలో సీనియర్ సభ్యుడుగా గుర్తించాయి.

గరియాబంద్‌లోని మారుమూల ప్రాంతంలో మావో యిస్టుల కదలికలపై నిఘా ఉంచిన రాష్ట్ర పోలీసు బృందాలు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), కోబ్రా బెటాలియన్ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా పర్యవేక్షిస్తున్నారు.

మావోయిస్టులకు బలమైన స్థావరం గరియాబంద్

గరియాబంద్ జిల్లా చాలాకాలంగా మావోయిస్టు కార్యకలాపాలకు బలమైన స్థావరంగా ఉంది, ఇక్కడ భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య అనేక ఎన్‌కౌంటర్లు జరిగాయి.

ఇటీవలి సంవత్సరాలలో, భద్రతా దళాలు ఇక్కడ నక్సలిజాన్ని బలహీన పర్చేందు కు.. ఆపరేషన్లను మరింత ఉధృతం చేశాయి.

మనోజ్ ఎవరు?

మనోజ్ అలియాస్ మోడెం బాలకృష్ణ మావోయిస్టు సంస్థలో కీలకనేతగా ఉన్నారు. హత్య, దోపిడీ, పోలీసులపై దాడి కేసుల్లో ఆయన నిందితుడని భద్రతాబలగాలు తెలిపాయి. బాలకృష్ణ మృతితో మావోయిస్టు కార్యకలాపాల వెన్ను విరిచినట్టయిందని ఉన్నతాధికారులు అంటున్నారు. ఓవైపు మావోయిస్టుల లొంగుబాట్లు జరుగుతుంటే.. మరోవైపు ఎన్‌కౌంటర్ల పేరిట కేంద్రం అంతమొందిస్తుం దని పౌర సమాజం విమర్శిస్తోంది.

ఇసితో ఆర్‌జెడి బృందం భేటీ

పాట్నా : ఎలక్షన్ కమిషన్ (ఇసి) పూర్తి బెంచ్‌తో ఆర్‌జెడి ప్రతినిధి బృందం గురువారం భేటీ అయింది. బీహార్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్‌పై చర్చించింది. ఇసితో భేటీకి సంబంధించిన వివరాలను పార్టీ రాజ్యసభ సభ్యులు మనోజ్ ఝా మీడియాకు వెల్లడించారు. ఎస్ఐఆర్‌పై చర్చించామని, ఈ ప్రక్రియను మరింత పారదర్శకత, ఓటర్లకు అనుకూలంగా ఉండేలా నిర్వహించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. దాదాపు రెండున్నర గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్‌పై ఆర్‌జెడి అభ్యంతరాలను, ఆందోళనలను ఇసి దృష్టికి తీసుకెళ్లామని, ఇసి తగిన చర్యలు తీసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ బృందంలో మనోజ్ ఝాతో పాటు ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్, పార్టీ నాయకులు చిత్తరంజన్ గగన్ కూడా ఉన్నారు.

సోనియాపై పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ : భారత పౌరసత్వం పొందడానికి ముందే ఎన్నికల జాబితాలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేరు చేర్చారని పేర్కొంటూ దాఖలైన పిల్‌ను ఢిల్లీ కోర్టు గురువారం కొట్టివేసింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా ఈ పిటిషన్‌ను తోసిపుచ్చారు. 1980 జనవరిలో సోనియాగాంధీకి భారత పౌరసత్వం రావడానికి మూడేళ్ల ముందే ఆమె పేరు న్యూఢిల్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో చేర్చారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికాస్ త్రిపాఠి పిల్ దాఖలు చేశారు.

బీహార్‌లో 112 డ్రైవర్ల ఆందోళన

- ఎన్నికలకు ముందు నితీష్‌కుమార్‌పై ఆగ్రహజ్వాల

పాట్నా : అసెంబ్లీ ఎన్నికలకు ముందు అన్ని వర్గాల ప్రజల నుంచి బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వానికి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమర్జెన్సీ సర్వీస్ డయల్ 112 డ్రైవర్లు ఆందోళనకు దిగారు. తక్కువ వేతనాలు, పని పరిస్థితులు సక్రమంగా లేకపోవడం, అధికారిక గుర్తింపు లేకపోవడం వంటి వాటికి వ్యతిరేకంగా కొన్ని రోజులుగా డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. వీరిలో అత్యధికులు మాజీ సైనికులు. పాటాల్నో గార్ధనిబాగ్ నుంచి కార్గిల్ చౌక్ వరకూ మువన్నెల జెండాలు ధరించి మంగళవారం మార్చ్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. 2022 జనవరిలో తమకు నెల జీతం రూ.25 వేలుకు పెంచుతామని హామీ ఇచ్చారని, కేవలం రూ.750 పెంచారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారాంతపు సెలవు, బీమా వంటి హామీలు కూడా అమలు కావడం లేదని చెప్పారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చ్‌లో బీహార్ నలుమూలల నుంచి వచ్చిన డ్రైవర్లు పాల్గొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత విస్తరిస్తామని హెచ్చరించారు.





లోకల్ కరెన్సీలో వాణిజ్యం

మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రతో భేటీలో మోడీ

వారణాసి : భారత్, మారిషస్ రెండు వేర్వేరు దేశాలే అయినా వాటి కలలు, గమ్యాలు ఒకటేనని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఇరు దేశాలు భాగ స్వామ్యులు మాత్రమే కాదనీ, ఒకే కుటుంబమని వ్యాఖ్యానించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాంతో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పలు కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి.

అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రత, సముద్ర సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని అన్నారు. స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేసేందుకు ఇరుదేశాలు నిర్ణయించాయని చెప్పారు. భారత్ ఎల్లప్పుడూ వలసరాజ్యాల నిర్మూలనకు, మారిషస్ సార్వభౌమత్వాన్ని పూర్తిగా గుర్తించడానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. రామ్‌గులాం ఈ నెల 9నుంచి 16 వరకూ భారత్‌లో పర్యటిస్తున్నారు.



మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రతో చర్చలు జరుపుతున్న మోడీ

బంగ్లాదేశ్ సునాయాసంగా...

- లింటన్ దాస్ అర్ధసెంచరీ
- హాంకాంగ్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు



అబుదాబి: ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో పసికూన హాంకాంగ్‌పై బంగ్లాదేశ్ జట్టు సునాయాసంగా విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 143పరుగులు చేయగా.. అనంతరం బంగ్లా జట్టు 17.4ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 144పరుగులు చేసి గెలిచింది. బంగ్లాదేశ్ జట్టులో లింటన్ దాస్(59) అర్ధసెంచరీకి తోడు తౌహిద్ హృదయ్(35నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఓపెనర్లు హొస్సైన్(19), తమీమ్(14) నిరాశపరిచినా.. లింటన్ దాస్, తౌహిద్ మ్యాచ్‌ను ముగించారు. హాంకాంగ్ బౌలర్లు అతీక్ ఇక్బాల్‌కు రెండు, ఆయుస్ శుక్లాకు ఒక వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ జీషన్(30) రాణించినా.. అన్షుమాన్(4), బాబర్(14) నిరాశపరిచారు. దీంతో హాంకాంగ్ 30పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో నిజకత్(42), యాసిమ్(28) హాంకాంగ్ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ 3వ వికెట్‌కు 41పరుగులు జోడించారు. వీరిద్దరి నిష్క్రమణ ర్వాత లోయర్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో హాంకాంగ్ జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 143పరుగులే చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లు తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్, రిషాద్ హొస్సైన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. గ్రూప్-బిలో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ చేతిలో 94పరుగులకే కుప్పకూలిన హాంకాంగ్.. రెండో లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గౌరవప్రద స్కోర్‌తో ఆకట్టుకుంది. ఈ ఓటమితో హాంకాంగ్ జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించగా.. నామమాత్రపు మూడో, చివరి లీగ్ మ్యాచ్‌లో 15న శ్రీలంకతో తలపడనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లింటన్ దాస్‌కు దక్కింది. నేడు పాకిస్తాన్, ఒమన్ జట్ల మధ్య గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్ జరగనుంది.

క్వార్టర్స్‌కు లక్ష్యసేన్, ఆయుష్

- హాంకాంగ్ బ్యాడ్మింటన్ టోర్నీ



హాంకాంగ్: హాంకాంగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అంచనాలకు మించి రాణిస్తున్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌తో పాటు డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి క్వార్టర్‌ఫైనల్‌కు చేరగా.. ఆయుష్ శెట్టి ఏకంగా 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత కొడాయ్ నరోకా(జపాన్)పై సంచలన విజయం సాధించాడు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో 20ఏళ్ల ఆయుస్ శెట్టి 21-19, 12-21, 21-14తో ప్రపంచ 2వ ర్యాంకర్, జపాన్‌కు చెందిన నరోకాకు ఝలక్ ఇచ్చాడు. మూడుసెట్ల హోరాహోరీ పోరు సుమారు 72నిమిషాలసేపు సాగింది. మరో ప్రి క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 15-21, 21-18, 21-10తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌ను ఓడించాడు. క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్-ఆయుష్ శెట్టి తలపడనున్నారు. ఇక క్వాలిఫయర్ కిరణ్ జార్జి పోరాటం రెండోరౌండ్‌లో ముగిసింది. 3వ ర్యాంకర్ ఛౌ టిన్ చెస్(చైనీస్ తైపీ)తో జరిగిన పోటీలో కిరణ్ జార్జి 6-21, 12-21తో వరుససెట్లలో ఓటమిపాలయ్యాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట కూడా క్వార్టర్స్‌కు చేరింది. రెండోరౌండ్‌లో భారత జంట 18-21, 21-15, 21-11తో థాయ్‌లాండ్ జంటను చిత్తుచేసింది. క్వార్టర్స్‌లో 8వ సీడ్ భారత షట్లర్ల జోడీ మలేషియా జంటతో తలపడనున్నారు.

రష్యా చమురు కొనుగోలు ఆపిన తరువాతే భారత్‌తో చర్చలు

- అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్

వాషింగ్టన్ : రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపిన తరువాతే భారతదేశంతో వాణిజ్య చర్చలుంటాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ స్పష్టం చేశారు. గురువారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హోవార్డ్ మాట్లాడుతు భారత్ మాతో సరైన వాణిజ్య ఒప్పందాలు కోరుకుంటే రష్యా చమురు దిగుమతులు నిలిపేయాలన్నారు. 'అమెరికా ఒత్తిడితో భారత్ మరో రెండు, మూడు నెలల్లో చర్చలకు వస్తుంది. వారు క్షమించాలని కోరుతున్నారు, ట్రంప్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నారు' అని అన్నారు. ఇదంతా రష్యాతో చమురు కొనడం ఆపేసిన తరువాతేనని పునరుద్ఘాటించారు. మరోవైపు మంగళవారం ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ట్రంప్ " ఇండియా, అమెరికా మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కారానికి చర్చలు కొనసాగుతాయని సంతోషంగా ప్రకటిస్తున్నాను " అని చెప్పారు. తన మంచి స్నేహితుడు ప్రధాని మోడీతో త్వరలో మాట్లాడాలని ఆశిస్తున్నానని కూడా చెప్పారు. దీనిపై మోడీ ఎక్స్‌లో ప్రతిస్పందిస్తు భారత్, అమెరికాలు సహజ మిత్రులని, వాణిజ్య చర్చలతో ఇరు దేశాల సామర్థ్యాలు పెరుగుతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఇండియా, చైనాపై వంద శాతం టారిఫ్‌లు విధించాలని యూరోపియన్ యూనియన్ (ఇయు)కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడం కొసమెరుపు. ఇండియా, చైనాలు రష్యా చమురును పెద్ద స్థాయిలో కొనుగోలు చేస్తున్నందువల్లే రష్యా ఉక్రెయిన్‌పై తన దాడులను కొనసాగిస్తూ, ఆర్థికంగా లాభపడుతుందని వాషింగ్టన్ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. గతంలో పలుమార్లు ట్రంప్ రష్యా నుండి గ్యాస్ , చమురు దిగుమతి చేసుకోవద్దని యూరోపియన్ యూనియన్‌ను హెచ్చరించారు. ఇయు గత ఏడాది 19% గ్యాస్‌ను దిగుమతి చేసుకుంది. ట్రంప్ తాజా ప్రతిపాదనను ఇయు అంగీకరిస్తే కీలకమైన మార్పు అవుతుంది. ఇప్పటివరకు యూరోపియన్ యూనియన్ రష్యాపై ఆంక్షలు మాత్రమే విధించింది. త్వరలో జరగనున్న యూరోపియన్ యూనియన్, ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ సమావేశంలో ఈ అంశం చర్చకు వస్తుందని పలువురు భావిస్తున్నారు.

సిట్‌లో సమానంగా హిందూ -ముస్లిం అధికారులు

- 2023 అకోలా మతఘర్షణల కేసులో సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : 2023 అకోలా మతఘర్షణల కేసులో సుప్రీంకోర్టు అపూర్వమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ కోసం హిందూ - ముస్లిం అధికారులు సమాన సంఖ్యలో ఉండే విధంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోలీసులు తమ యూనిఫామ్ ధరించేటప్పుడు మత, జాతి, కులపరమైన రంగులు తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలీసులు ఎలాంటి సామాజిక, వ్యక్తిగత అభిరుచులు, పక్షపాతాలు లేకుండా యునిఫామ్‌కు సంపూర్ణ, చిత్తశుద్ధితో కట్టుబడి ఉండాలని, దురదృష్టవశాత్తూ ఈ కేసులో అలా జరగలేదని అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆటో రిక్షాలో ఒక వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడిచేసి హత్య చేయడాన్ని 17 ఏళ్ల మహ్మద్ అఫ్జల్ షరీఫ్ చూశాడు. తరువాత అతనిపై కూడా ఈ వ్యక్తులు దాడి చేశారు. హత్యకు గురైన వ్యక్తిని విలాస్ మహాదేవరావు గైక్వాడ్‌గా గుర్తించారు. అతను ఒక ముస్లింకు చెందిన ఆటో రిక్షాను నడుపుతున్నాడు. గైక్వాడ్‌ను ముస్లిముగా భావించి, హత్య చేశారు. హత్యను స్వయంగా చూసానని అఫ్జల్ తన తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. ఆ బాలుడు చేస్తున్న ఆరోపణలు నిజమా.. కాదా.. అనేది పోలీసుల దర్యాప్తు తరువాత వెల్లడవుతుందని, అసలుకే ఫిర్యాదుపై చర్య తీసుకోవడంలో అకోలా ఎస్‌పి విఫలమవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. 'హిందూ - ముస్లింలకు చెందిన సీనియర్ పోలీసు అధికారులతో కూడిన సిట్‌ని ఏర్పాటు చేయాలని, అప్పీలుదారుడు చేసిన అన్ని ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని, 2023 మే 13న అతనిపై జరిగిన దాడికి సంబంధించి ఫిర్యాదు నమోదు చేసి, దానిపై తగిన చర్య తీసుకోవాలని' మహారాష్ట్ర హోం కార్యదర్శిని ఆదేశించింది. సిట్ తన దర్యాప్తు నివేదికను మూడు నెలల్లోగా రికార్డు చేయాలని ఆదేశించింది. నిర్లక్ష్యంతో విధులను నిర్వర్తించినందుకు పోలీసు అధికారులపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కూడా రాష్ట్ర హోం కార్యదర్శిని కూడా ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది.

నేడు 'మిరాయ్' సినిమా విడుదల

తేజ సజ్జా కథానాయకుడిగా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన సినిమా 'మిరాయ్'. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం శుక్రవారం నాడు విడుదల కానుంది. మంచు మనోజ్ ఈ సినిమాలో కీలకపాత్రలో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. 'ఈ సినిమాతో ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాం. యాక్షన్, అడ్వంచర్‌తోపాటు ఆశ్చర్యపోయే ఎన్నో విషయాలు ఉంటాయి. పిల్లలు మొదలుకొని అందరికీ నచ్చే సినిమా. మంచి సినిమా చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో మేమంతా పనిచేశాం' నిర్మాత టిజి విశ్వప్రసాద్ వెల్లడించారు.



'తెలుసు కదా' టీజర్ విడుదల



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, రాశీఖన్నా, శ్రీనిధిశెట్టి కథానాయికలుగా నటించిన సినిమా 'తెలుసు కదా'. ఈ సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. నీరజ కోన దర్శకత్వంలో టిజి విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించారు. అక్టోబర్ 17న విడుదల కానుంది. డీజేటిల్లు, టిల్లు స్క్వేర్ వంటి హిట్ చిత్రాల తర్వాత సిద్ధు నటించిన జాక్ మూవీ నిరుత్సాహపర్చింది. తెలుసు కదా సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇందులో వైవా హర్ష కీలకపాత్రల్లో నటించారు. తమన్ సంగీతాన్ని



చరిత్రలో నిలిచే చిత్రం 'నేనెవరు?' : రాజేంద్ర ప్రసాద్

'నేను నటించిన మంచి సినిమాల్లో ఒకటిగా నిలిచిపోయే చిత్రం 'నేనెవరు?'. దర్శకుడు చిరంజీవి ఈ కథ నాకు చెప్పినప్పుడు లిటరల్‌గా షాక్ అయ్యా. ఇంత గొప్ప కథను కరెక్ట్‌గా తెరకెక్కించగలడా? అని సందేహపడ్డా. షూటింగ్‌కు వెళ్లాక కానీ... అతను ఎంత జీనియస్ అన్నది అర్థం కాలేదు. నిర్మాతలు కూడా ఎంతో తపన, నిబద్ధత కలిగిన వ్యక్తులు. వాళ్ళకు 'నేనెవరు?' చిత్రంతో ఘన విజయం సొంతం కావాలి' అని డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. 'నేనెవరు?' సినిమా దసరాకు విడుదల కానున్న సందర్భంగా ఆడియో, టీజర్ విడుదల హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, ప్రముఖ దర్శకులు వి.సముద్ర ముఖ్య అతిథులుగా హాజరై రాజేంద్రప్రసాద్ సినీ రంగానికి చేస్తున్న సేవలను అభినందించారు. నువ్వే కావాలి, ప్రేమించు వంటి విజయవంతమైన చిత్రాల ఫేమ్ సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో నటించారు.

చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో సందేశభరిత వినోదాత్మకంగా జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లికార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్‌బాబు - సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రంతో అభిలాష్, సాయిచెర్రి కథానాయకులుగా పరిచయమవుతున్నారు. దీపిక, సోనాక్షి జబర్దస్త్ రాజమౌళి ఇతర పాత్రలు పోషించారు.

నేటితో 'లక్ష్మణరేఖ'కు 50 సంవత్సరాలు





సహజనటి జయసుధ కథానాయికగా పరిచయమైన చిత్రం 'లక్ష్మణరేఖ'. ఏభై ఏళ్ళ క్రితం సెప్టెంబర్ 12, 1975లో విడుదలైన ఈ చిత్రంతో దర్శకుడిగా మారిన గోపాలకృష్ణ ఇంటిపేరు 'లక్ష్మణరేఖ'గా మారిపోయింది. ఈ చిత్రంలో మురళీమోహన్- జయసుధ జంటగా నటించగా చంద్రమోహన్ నెగటివ్ షేడ్స్ కలిగిన ముఖ్య పాత్ర పోషించారు. గుమ్మడి, అల్లు రామలింగయ్యలు ఇతర కీలక పాత్రల్లో నటించారు. సత్యం సంగీత సారథ్యం వహించారు. ఎవికె ప్రొడక్షన్స్ పతాకంపై షణ్ముగం చెట్టియార్-కృష్ణారావు సంయుక్తంగా నిర్మించారు. 'లక్ష్మణ రేఖ' గోపాలకృష్ణను పలువురు సినీ ప్రముఖులు అభినందించారు.

ప్రపంచ రికార్డు గర్వకారణం : తుమ్మలపల్లి



'అత్యధిక భాషల్లో సినిమాలు నిర్మించిన వ్యక్తిగా డాక్టర్ డి.రామానాయుడు చరిత్రకెక్కితే... ఒకేరోజు 15 చిత్రాలు ప్రారంభించిన నిర్మాతగా భీమవరం టాకీస్ అధినేతగా నేను ప్రపంచ రికార్డు సాధించాను. నా వల్ల తెలుగు సినిమాకి ఓ గొప్ప గౌరవం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ ఘనత నా ఒక్కడిదే కాదు. నా వెన్నంటి ఉన్న వందలాది మందికి కూడా చెందుతుంది. 'యండమూరి కథలు, కె.పి.హెచ్.బి. కాలనీలో, మా నాన్న హీరో, మహానాగ' చిత్రాలు రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకుంటున్నాయి. మిగతావి ప్రీ-ప్రొడక్షన్‌లో ఉన్నాయి. ఇదే ఏడాదిలో ఒక ప్రముఖ దర్శకుడితో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించేందుకు సైతం సన్నాహాలు జరుగుతున్నాయి. నిర్మాతగా 200 చిత్రాలు పూర్తి చేయాలన్నదే నా జీవితాశయం' అని దర్శకుడు తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భీమవరంలో రామసత్యనారాయణను రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు కలిసి అభినందించారు.

భారత హాకీజట్టుకు నిరాశ

- చైనా చేతిలో ఓడినా.. ఫైనల్ ఆశలు సజీవం
- ఆసియాకప్ మహిళల హాకీ

హాంగ్జౌ(చైనా): ఆసియాకప్ మహిళల హాకీలో భారతజట్టుకు సూపర్-4 రెండో మ్యాచ్‌లో నిరాశ తప్పలేదు. ఆతిథ్య చైనాతో గురువారం జరిగిన హోరాహోరీ పోరులో భారతజట్టు 1-4గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భాగంగా మ్యాచ్ ప్రారంభమైన 4వ ని.లోనే చైనా తరఫున జో మిరాంగ్ గోల్ కొట్టి చైనాకు 1-0 ఆధిక్యతలో నిలిపింది. ఆ తర్వాత రెండో క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్ చేయకున్నా.. మూడో క్వార్టర్ ప్రారంభంలో 31వ ని.లో చెన్ యంగ్ ఒక గోల్ చేయడంలో చైనా 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్(38వ ని.లో) గోల్ చేయడంతో చైనా ఆధిక్యత 1-2కు తగ్గింది. కానీ నాల్గో క్వార్టర్‌లో భారత క్రీడాకారిణులు పోరాడినా.. ప్రయోజనం లేకపోయింది. ఆ దశలో చైనా స్టార్ జూ(56వ ని.లో) మరో గోల్ చేయడం, జిన్హ్వ(47వ ని.లో) ఒక గోల్ చేయడంతో చైనా 1-4గోల్స్‌తో విజయఢంకా మోగించింది. కొరియా-జపాన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 2-2తో డ్రా అయ్యింది.



తొలి మ్యాచ్‌లో కొరియాపై గెలిచిన భారతజట్టు శనివారం జరిగే చివరి సూపర్-4 మ్యాచ్‌లో జపాన్‌పై గెలిస్తే నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. శనివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్‌తో, చైనా జట్టు కొరియాతో తలపడనున్నాయి. కొరియా జట్టు చైనాను ఓడిస్తేనే సమీకరణలు మారనున్నాయి. జపాన్ తొలి సూపర్-4 మ్యాచ్‌లో చైనా చేతిలో 0-2 గోల్స్‌తో ఓటమిపాలైంది.

సౌత్‌జోన్ ఢమాల్

- 149పరుగులకే పరిమితం
- సెంట్రల్ జోన్‌తో దులీప్ ట్రోఫీ ఫైనల్



బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్‌జోన్ జట్టు తొలిరోజే పట్టు బిగించింది. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో గురువారం నుంచి ప్రారంభమైన దులీప్ ట్రోఫీ ఫైనల్లో టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ కెప్టెన్ రజత్ పాటిదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని సెంట్రల్‌జోన్ బౌలర్లు వమ్ము కానివ్వలేదు. సరాన్ష్ జైన్(5/49), కుమార్ కార్తికేయ (4/53) అద్భుత బౌలింగ్‌తో మెరిసారు. వీరిద్దరు సౌత్‌జోన్ బ్యాటర్లను క్రీజ్‌లో నిలదొక్కుకొనే అవకాశమివ్వలేదు. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(31), సల్మాన్ నిజర్(24), అంకిత్‌శర్మ (20) మాత్రమే ఆశించిన స్థాయిలో రాణించారు. మెహిత్ కాలే(9), రవిచంద్రన్(1), కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్(4), ఆండ్రే సిద్ధార్థ్ (12) స్వల్ప స్కోర్లకే పెవీలియన్‌కు చేరారు. దీంతో సౌత్‌జోన్ ఇన్నింగ్స్ 63ఓవర్లలో 149 పరుగులకే పరిమితమైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 19ఓవర్ల లో వికెట్లేమీ నష్టపోకుండా 50పరుగులు చేసింది.


సెమీస్‌కు పూజరాణి



ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

న్యూయార్క్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ మహిళా బాక్సర్ పూజ రాణి సత్తా చాటింది. గురువారం జరిగిన మహిళల 80కిలోల విభాగం క్వార్టర్స్‌లో 34ఏళ్ల పూజ రాణి 3-2పాయింట్ల తేడాతో పోలండ్‌కు చెందిన ఎమిలియా కొటెరెస్కాను ఓడించింది. ఈ విభాగంలో నాన్-ఒలింపిక్ కేటగిరిలో 12మంది బాక్సర్లు పోటీపడుతున్నారు. సెమీస్‌కు చేరడం ద్వారా పూజ రాణికి కాంస్య పతకం ఖాయమైంది. సెమీస్‌లో ఓడిన ఇద్దరు బాక్సర్లకు కాంస్య పతకాలు దక్కనున్నాయి. ఇక పురుషుల 65కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో అవినాశ్ జమాల్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జార్జియాకు చెందిన లషా గురాలీ చేతిలో 1-4పాయింట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. జైస్మిన్ లంబోరియా(57కిలోలు), నూపుర్ షెయోరాన్(80+) ఆయా కేటగిరీల్లో ఇప్పటికే సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. సెమీస్‌లో పూజ రాణి బ్రిటన్‌కు చెందిన బాక్సర్‌తో తలపడనుంది.

హోరాహోరీ పోరులో ముంబ గెలుపు



ప్రొ కబడ్డీ సీజన్-12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్-12 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం జరిగినతొలి లీగ్ మ్యాచ్‌లో యు ముంబ జట్టు ఒక్క పాయింట్ తేడాతో పట్నా పైరెట్స్‌పై సంచలన విజయం సాధించింది. చివరిపాయింట్ వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ పోటీలో యు ముంబ జట్టు 40-39పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌పై విజయం సాధించింది. ముంబ జట్టులో అమీర్ మహ్మద్(12పాయింట్లు)కి తోడు ఆల్‌రౌండర్ అనిల్(9), రైడర్ సందీప్(4), డిఫెండర్ విజయ్ కుమార్(4) రాణించారు. ఇక పట్నా జట్టులో రైడర్ అయాన్(21పాయింట్లు) సత్తా చాటగా.. మిగిలిన వారంతా నిరాశపరిచారు. ఈ గెలుపుతో యు ముంబ జట్టు 6మ్యాచ్‌లు ముగిసేసరికి 16పాయింట్లతో మూడోస్థానానికి ఎగబాకింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు 38-28పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది.

ప్రొ కబడ్డీలో నేడు...

జైపూర్ పింక్ ప్యాంథర్స్ × బెంగళూరు బుల్స్(రాత్రి 8.00గం॥లకు)

తమిళ్ తలైవాస్ × బెంగాల్ వారియర్స్(రాత్రి 9.00గం॥లకు)

మోడీని వదిలించుకుంటేనే దేశం ముందుకు



మీడియాతో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు, చిత్రంలో వి.రాంభూపాల్

- విలేకరుల సమావేశంలో బి.వి.రాఘవులు
- బిజెపితో ఉంటే టిడిపి మాయమవుతుంది
- మిత్రులకు లాభంచేయడానికే భూసమీకరణ
- లోకేష్ ప్రకటనల్లో రాష్ట్ర భవిష్యత్‌పై ఆలోచన లేదు
- రుషికొండ భవనాల్లో సైన్స్, ఆర్ట్స్, హెరిటేజ్ మ్యూజియం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ రాజకీయాల్లో ప్రధాని మోడీ అనుసరిస్తున్న మతోన్మాద, విభజన విధానాల వల్ల దేశ ఐక్యతకు నష్టం వస్తుందని, ఇటువంటి వారిని వదిలించుకుంటేనే దేశం ముందుకు పోతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడ బాలోత్సవ భవన్లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ భిన్న సంస్కృతులను అంగీకరిస్తామని ప్రధాని తెలిపారని, ఒకవైపు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ప్రజల మధ్య చిచ్చుపెడుతూ ఇలాంటి మాటలు చెబితే ప్రజలు అంగీకరించరని అన్నారు. నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్లు ఈ మాటలు ఉన్నాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భవగత్ కూడా రాజ్యాంగాన్ని అంగీకరిస్తామని, అయోధ్య రామాలయం తప్ప ఏ విషయంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం చేసుకోదని చెబుతూనే కాశి, మధురలలో కార్యకర్తలు జోక్యం చేసుకోవచ్చని చెప్పారని అన్నారు. ఈ మాటలను అంగీకరించడానికి ప్రజలు అవివేకులు, అర్థం చేసుకోలేనివారు కాదని చెప్పారు. . విచ్ఛిన్నకర పాలన చేస్తున్న మోడీ లాంటి వారికి ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఊతం ఇస్తున్నాయని, తద్వారా రాష్ట్ర రాజకీయాలకు దుర్గతి పట్టిస్తున్నారని చెప్పారు. బిజెపికి బేషరతుగా మద్దతు ఇస్తున్నామని రాష్ట్ర మంత్రి లోకేష్ చెబుతున్నారని, అంటే రాష్ట్రానికి ఏమి కావాలో కేంద్రాన్ని అడగరా అని ప్రశ్నించారు. దీనివల్ల టిడిపి ఉనికినే ప్రశ్నించుకునే పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. అలాగే 30 రోజులు జైల్లో ఉంటే పదవులు కోల్పోతారనే బిల్లుకూ ఆమోదం తెలిపారని, చంద్రబాబు, జగన్ కూడా జైల్లో ఉన్నారని, వీరందరూ రాజకీయాలకు దూరం అవ్వాలా అని ప్రశ్నించారు. బిజెపితో విడిపోయిన సమయంలో పొరపాటు జరిగిందని లోకేష్ చెబుతున్నారని, అంటే భవిష్యత్ మొత్తం బిజెపితోనే కలిసి నడుస్తారా అన్న విషయాన్నైనా చెప్పాలన్నారు. బిజెపికి టిడిపి దూరం జరిగితేనే రాష్ట్రానికి లాభమని, అంటకాగితే టిడిపి మాయం అవడానికి ఎంతో సమయం పట్టదని అన్నారు. దేశంలో బిజెపితో కలిసిన ప్రాంతీయ పార్టీలకు పట్టిస్తున్న గతిని తెలుసుకోకుండా టిడిపి నాయకులు బిజెపికి అంటకాగడం సరికాదన్నారు. పైగా తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేకత ఉందని, దాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ట్రంప్ సుంకాల వల్ల రాష్ట్రంలో ఆక్వా రైతులు దెబ్బతిన్నారని, 50 లక్షల మంది పాడి రైతులు కూడా ట్రంప్‌తో ఒప్పందం జరిగితే నష్టపోతారని తెలిపారు. ట్రంప్ సుంకాలపై కేంద్రం ఏమి చేస్తుందో అడిగే ధైర్యం రాష్ట్ర పాలకులకు లేకుండా పోయిందన్నారు. ఇలాంటి చర్యల ద్వారా టిడిపి బిజెపికి గులాంగిరీ చేస్తోందని మండిపడ్డారు. విశాఖలో రుషికొండ భవనాలు పాతకాలపు రాజమందిరాల్లా ఉన్నాయని గతంలో విమర్శించిన టిడిపి, జనసేన నాయకులు వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇంతవరకు తేల్చుకోలేకపోవడం అన్యాయమన్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలను కల్యాణ మండపాలు, రిసార్టుల్లా కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సైన్స్, ఆర్ట్, హెరిటేజ్ మ్యూజియంగా అభివృద్ధి చేయాలని, సిపిఎం వైఖరి కూడా అదేనని అన్నారు. క్వాంటం టెక్నాలజీ వైపు వెళుతున్నామని చంద్రబాబు ఇలాంటివి చేయడం ద్వారా యువతను టెక్నాలజీ, సైన్స్ వైపు మళ్లించవచ్చని అన్నారు. రుషికొండ రిసార్టు కళ్యాణ మండపం, కాన్ఫరెన్సు హాలు చేస్తే ధనవంతుల విలాసాలకు మాత్రమే ఉపయోగపడతాయని, మ్యూజియం చేస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగమని అన్నారు. ఇలాంటివి ఇప్పటికే ఢిల్లీ, చెన్నై, బెంగుళూరులో ఉన్నాయని పేర్కొన్నారు. అమరావతి రాజధాని పరిధిలోనూ జంతు ప్రదర్శనశాల బొటానికల్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాయలసీమలోనూ మరొకటి నిర్మించాలని తెలిపారు.

విద్య, వైద్యం ప్రభుత్వరంగంలోనే ఉండాలి

విద్య, వైద్యం ప్రభుత్వరంగంలోనే ఉండాలని, వాటిని ప్రైవేటుపరం చేయడం ద్వారా సామాన్యులకు అవి అందకుండా పోతాయని అన్నారు. ప్రైవేటీకరణ అంటే అధికారంలో ఉన్న వారి మిత్రులకు దోచిపెట్టడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆస్తుల ప్రైవేటీకరణలోనూ, పిపిపి పద్ధతి అనుసరించడంలోనూ జగన్‌కు, చంద్రబాబుకు పెద్ద తేడా లేదని అన్నారు. పిపిపి అంటేనే అందినకాడికి దోచుకోవడమని, ఈ రెండు పార్టీలూ ఆదే పద్ధతిని పాటిస్తున్నాయని తెలిపారు.

ప్రజల భూములతో ప్రభుత్వ వ్యాపారం

రాష్ట్రంలో భూ సమీకరణ పేరుతో ప్రజల భూములను బెదిరించి లాక్కుని వాటితో ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని రాఘవులు అన్నారు. వాటిని ఎక్కువ ధరకు అమ్మితే ప్రభుత్వానికి లాభమని, తక్కువ ధరకు అమ్మితే ప్రభుత్వంలో ఉన్న పెద్దల మిత్రులకు లాభమని తెలిపారు. జగన్, టిడిపి, బిజెపి పార్టీలన్నీ అంతేనని, రైతుల భూములతో వ్యాపారం చేసుకుంటున్నాయని విమర్శించారు. ప్రజావసరాలకు భూ సమీకరణ, సేకరణ ఏదైనా సరే రైతుల అనుమతితో జరగాలని, అదీ పంటలు పండే భూములు తీసుకోకూడదని, పర్రలుగా ఉన్న వాటిని తీసుకుని అభివృద్ధి చేయాలని అన్నారు. నష్టపరిహారం 2013 భూ సేకరణ చట్టం కింద ఇస్తేనే భూములిచ్చిన వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. సమీకరణ అంటే రైతులను నయానో భయానో బెదిరించి లాక్కోవడం తప్ప మరొకటి కాదని అన్నారు.

జౌళి పరిశ్రమకు సుంకాల పోటు

- 10 శాతం ఆదాయం పతనం : క్రిసిల్ అంచనా

న్యూఢిల్లీ : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన సుంకాలు అనేక పరిశ్రమలపై పెను ప్రభావం చూపిస్తున్నాయి. దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ, ఆక్వా, జౌళి తదితర పరిశ్రమల ఆదాయం క్షీణిస్తోంది. ఇదే విషయాన్ని ప్రముఖ రేటింగ్, రీసెర్చ్ సంస్థ క్రిసిల్ తెలిపింది.

ఈ సంస్థ అంచనా ప్రకారం..అమెరికా సుంకాల పెంపు కారణంగా టెక్స్‌టైల్ పరిశ్రమ భారీ నష్టాలు చవిచూస్తోంది. ఆగస్టు 27 నుంచి ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో జౌళి పరిశ్రమ ఆదాయం 5-10 శాతం పతనం కావొచ్చని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ నష్టాన్ని ఎదుర్కోవాల్సివుంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. 40 కంపెనీల అభిప్రాయాలను సేకరించి..రూపొందించిన ఒక నివేదికలో క్రిసిల్ ఈ వివరాలు తెలిపింది. మొత్తం పరిశ్రమలో వీటి రెవెన్యూ వాటా 40-45 శాతం వరకు ఉంటుంది. అధిక టారిఫ్‌లతో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, టర్కీ దేశాల ఉత్పత్తులతో పోటీ పడటం కష్టంగా మారనుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. టెక్స్‌టైల్ కంపెనీల లాభాలు కూడా 200-250 బేసిస్ పాయింట్లు 2.5 శాతం మేర పడిపోవచ్చని అంచనా.

కులదురహంకార హత్యలు తగవు


- సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటనలివి
- కవిన్ కుటుంబానికి బృందాకరత్


కవిన్ సెల్వ గణేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకురాలు బృందాకరత్

చెన్నై : తిరునల్వేలిలో ఇటీవల జరిగిన కులదురహంకార హత్యకు గురైన కవిన్ సెల్వ గణేష్ కుటుంబాన్ని సిపిఎం నాయకురాలు బృందాకరత్ పరామర్శించారు. పెత్తందారీ కులానికి చెందిన మహిళతో సంబంధం ఉందనే ఆరోపణలతో దళితుడైన కవిన్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కవిన్ కుటుంబ సభ్యులను గురువారం బృందాకరత్ కలిసి ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కవిన్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, కేంద్ర కమిటీ సభ్యుడు పి. సంపత్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. కనగరాజ్ , కె. అర్జునన్, తదితరులు ఉన్నారు.

తాత్కాలిక నాయకత్వంపై
కొనసాగుతున్న అనిశ్చితి

- కుల్మాన్ ఘీజింగ్ వైపు మొగ్గు?
- నేపాల్ సంక్షోభ పరిష్కారానికి చర్చలే శరణ్యమన్న నేతలు
- 34కు పెరిగిన మరణాలు


జస్టిస్ సుశీల్ కర్కి
కుల్మాన్ ఘీజింగ్

ఖాట్మండు : అరాచక పరిస్థితులను, రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపాల్‌కు తాత్కాలికంగా నాయకత్వ బాధ్యతలు చేపట్టే విషయమై అనిశ్చితి కొనసాగుతోంది. సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీల్ కర్కి పేరును తొలుత జెన్ జడ్ యువత ప్రతిపాదించారు. ఆమె వయసు, అర్హతల ప్రాతిపదికన ఆందోళనకారులు ఆమె పేరును పక్కకు పెట్టి కుల్మాన్ ఘీజింగ్ పేరును ప్రతిపాదించారని కాంతిపూర్ టివి పేర్కొంది. ఆందోళనకారుల్లోనే మరో వర్గం ఇంకా కర్కిని బలపరుస్తోంది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఈ విషయం మీడియాకు తెలిపారు. మరోవైపు కర్కి కూడా చర్చల్లో పాల్గొంటున్నారు, నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి ఆమె సంసిద్ధంగా కూడా వున్నారని వార్తలు వెలువడుతున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫారమ్ డిస్కార్డ్ ద్వారా ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించగా, మెజారిటీ ప్రజలు సుశీలా కర్కి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. తక్షణమే తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పార్లమెంట్‌ను రద్దుచేయాలని ఖాట్మండు మేయర్ బాలేంద్ర షా అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు.

ఎవరీ కుల్మాన్ ఘీజింగ్?

తాను రేస్‌లో లేనని ఖాట్మండు మేయర్ బాలేంద్ర షా స్పష్టం చేయడంతో తెరపైకి వచ్చిన మరో పేరు కుల్మాన్ ఘీజింగ్. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఘీజింగ్ ఈ ఏడాది మార్చిలో వివాదాస్పద రీతిలో పదవీచ్యుతుడయ్యారు. ఏళ్ల తరబడి నేపాల్‌లో కొనసాగిన విద్యుత్ సంక్షోభాన్ని పరిష్కరించినట్లు చెబుతున్నారు.

శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలి

ఆందోళనల నేపథ్యంలో ప్రధాని ఓలి రాజీనామాతో దేశంలో నెలకొన్న పరిస్థితులను చక్కబరచాలంటే చర్చలే శరణ్యమని ప్రధాన రాజకీయ పార్టీల నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు చర్చల కోసం వారు పిలుపునిచ్చారు. ఈ మేరకు నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునిఫైడ్ మార్క్సిస్ట్ - లెనినిస్ట్), సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) నేతలు వేర్వేరుగా ప్రకటనలు చేశారు. రాజ్యాంగ చట్రపరిధిలో శాంతియుతంగా సంక్షోభాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం వుందని వారు నొక్కి చెప్పారు. యువత చేసిన డిమాండ్లను రాజ్యాంగ మార్గాల ద్వారా పరిష్కరించాలని కోరారు. ఈ పరిస్థితుల్లో జెన్ జడ్ కార్యకర్తలు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ వద్దకు చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చలు జరిపేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ సిగ్డల్‌కు అధికారమిచ్చారు.

34కి పెరిగిన మృతులు

నేపాల్ ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 34కి చేరింది. భద్రతా సిబ్బందితో జైల్లో ఖైదీలు ఘర్షణలకు దిగగా ముగ్గురు మరణించారు. దీంతో మరణించిన ఖైదీల సంఖ్య ఎనిమిదికి చేరింది. దేశవ్యాప్తంగా 1368 మంది చికిత్స పొందుతున్నారని ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. మరణించిన వారిలో 25మందిని గుర్తించినట్లు ఖాట్మండు పోస్ట్ పేర్కొంది. అంతర్జాతీయ ప్రోటోకాల్ మేరకు పోస్టుమార్టం నిర్వహించామని, వివరాలు వెల్లడించలేమని, మృతదేహాలను పరిరక్షించాల్సిందిగా కోరారని త్రిభువన్ యూనివర్శిటీ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగ అధికారులు తెలిపారు.

పారిపోయిన 15వేల మంది ఖైదీలు

నిరసనలు, అల్లర్లు చెలరేగిన ఆ రెండు రోజుల సమయంలో దేశవ్యాప్తంగా రెండు డజన్లకు పైగా జైళ్ల నుండి 15వేల మందికి పైగా ఖైదీలు పారిపోయారు. ఖాట్మండు లోయలోని మూడు జిల్లాల్లో నిషేధాజ్ఞలను సైన్యం పొడిగించింది. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనడంపై ఆర్మీ దృష్టి పెట్టి అందుకు తగిన చర్యలు తీసుకుంటుండగా తాత్కాలిక ప్రభుత్వ నేతలపై అనేక వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

నిరసనకారుల డిమాండ్ల పరిష్కారానికి కృషి : అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడల్

ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని నేపాల్ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడల్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ పరిధిలోనే వుంటూ సాధ్యమైనంత త్వరగా నిరసనకారుల డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. జాతినుద్దేశించి ప్రసంగించాలంటూ అభ్యర్థనలు వస్తున్న తరుణంలో పౌడల్ గురువారం ఒక ప్రకటన చేశారు. ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నానని చెప్పారు.

నాలుగున్నర ఎకరాలకు రూ.3,472 కోట్లు

ముంబయిలో భూమి కొనుగోలు చేసిన ఆర్‌బిఐ

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల దక్షిణ ముంబయిలోని నారీమన్ పాయింట్ ప్రాంతంలో వేల కోట్ల రూపాయలు చెల్లించి 4.61 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ముంబయి మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఏకంగా రూ.3,472 కోట్లు చెల్లించి దీన్ని స్వాధీనం చేసుకోవడం విశేషం. ఈ ప్రాంతం మంత్రాలయ, బాంబే హైకోర్టు, కొన్ని కార్పొరేట్ హెడ్‌క్వార్టర్లకు సమీపంలో ఉండటంతో ఇక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ భూమిని తొలుత వేలం వేయాలని ముంబయి మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తొలుత భావించింది. పలు పరిణామాలతో ఈ టెండర్ రద్దుకావడంతో ఆ స్థలాన్ని ఆర్‌బిఐ దక్కించుకుంది. తమ ప్రధాన కార్యాలయం విస్తరణకు ఈ స్థలాన్ని ఉపయోగించుకోవాలని భావించింది. దీనికి సంబంధించి సెప్టెంబర్ 5న రిజిస్ట్రేషన్ కాగా.. ఇందుకోసం రూ.208 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు సమాచారం. ముంబయిలో ఇదే అత్యంత ఖరీదైన భూమి ఒప్పంద విక్రయమని తెలుస్తోంది.

కతార్‌కు మద్దతుగా ఏకమవుతున్న మిత్రదేశాలు

- నెతన్యాహును దోషిగా నిలబెట్టాలని పిలుపు
- దాడులు శాంతి యత్నాలకు విఘాతమన్న హమాస్
- ఇజ్రాయిల్ దాడులతో గాజాలో మరో 32 మంది మృతి

గాజా, దోహా : కతార్ రాజధాని దోహాపై ఇజ్రాయిల్ దాడులతో విరుచుకుపడిన నేపథ్యంలో కతార్‌కు మద్దతుగా ప్రాంతీయ మిత్రపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. దోహా దాడుల్లో మరణించిన ఆరుగురికి జరిగిన అంత్యక్రియలకు కతార్ అమీర్ హాజరయ్యారు. ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదానికి పాల్పడినందుకు శిక్ష పడేలా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును న్యాయస్థానం ముందు నిలబెట్టాలని కతార్ ప్రధాని పిలుపునిచ్చారు. మరోవైపు గాజాను ఇజ్రాయిల్ బలగాలు దాడులతో హోరెత్తిస్తున్నాయి. గురువారంనాటి దాడుల్లో 32మంది మరణించారు. వీరిలో ఆహారం కోసం వెళ్లి మరణించిన వారు పదిమంది వున్నారు. ఇప్పటికే గాజా దక్షిణ ప్రాంతం కిక్కిరిసిపోయి వుండగా, 10లక్షలమందికి పైగా ప్రజలు గాజా నగరాన్ని వదిలి వెళ్లాలంటూ ఇజ్రాయిల్ బలవంతంగా వారిని వెళ్లగొట్టే ఆదేశాలు జారీ చేయడంపై మానవ హక్కుల సంఘాలు, మానవతా సాయమందించే సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి.

శాంతి యత్నాలకు దెబ్బే! : హమాస్

దోహాపై దాడులను శాంతి యత్నాలకు విఘాతంగా హమాస్ అభివర్ణించింది. ఈ మేరకు హమాస్ ప్రతినిధి ఫవ్జి బర్హూమ్ టివిలో ఒక ప్రకటన చేశారు. దోహాలో చర్చలు జరుపుతున్న హమాస్ ప్రతినిధి బృందాన్ని హత్య చేయాలని ప్రయత్నించడం, పైగా విదేశాల్లోని హమాస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటామంటూ బెదిరించారంటే 23 మాసాలుగా యుద్ధం కొనసాగించినా ఇంకా వారనుకున్నది చేయడంలో ఇజ్రాయిల్ విఫలమైందని అర్థమవుతోందని అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదన గురించి చర్చిస్తుంటే హత్యాయత్నం చేశారని బర్హూమ్ విమర్శించారు. మొత్తంగా చర్చల ప్రక్రియపై ఇలా దాడి జరపడం నేరమని విమర్శించారు. కతార్ సార్వభౌమాధికారంపై, వారి భద్రతపై దాడి చేయడం కాదని, మొత్తంగా అరబ్ దేశాలు, ఇస్లామిక్ దేశాలపై బహిరంగ యుద్ధాన్ని ప్రకటించడమని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ చర్యలు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతకు ముప్పుగా మారాయని ఆయన హెచ్చరించారు. ఈ నేరాలన్నింటికీ ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేయాలని ఆయన ప్రపంచ నేతలను కోరారు.

ఇజ్రాయిల్‌తో సంబంధాలొద్దు

ప్రపంచ దేశాలకు 140మంది ప్రముఖ ఆర్థికవేత్తల లేఖ

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ గాజాలో 'ఆకలిని ఆయుధంగా' వినియోగించడాన్ని ఖండిస్తూ 140మంది ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆకలిని తీవ్రతరం చేసే ఏ విధానాన్ని అయినా' తక్షణమే నిలిపివేయాలని అంతర్జాతీయ సమాజాన్ని, అమెరికా ప్రభుత్వాన్ని వారు కోరారు. ఇజ్రాయిల్‌తో ఆర్థిక, సాంస్కృతిక, క్రీడా సంబంధాలను బహిష్కరించాలంటూ ప్రపంచ దేశాలను కోరారు. ఈ మేరకు ప్రముఖ ప్రొఫెసర్లు, పరిశోధకులు మరియు ఇతర విద్యావేత్తలు సహా 140మంది ఆర్థిక వేత్తలు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. "ఆక్రమణలు, మారణహోమానికి నిధులు సమకూర్చే ఆర్థిక వ్యవస్థ" నుండి వైదొలగాలని వారు పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా ప్రజల జీవితాలను, సమాజాన్ని, పాలస్తీనా భవిష్యత్తును తీవ్రంగా నాశనం చేసినందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాలని అంతర్జాతీయ సమాజం, అమెరికా ప్రభుత్వాన్ని వారు ఆ ప్రకటనలో కోరారు. ఇదే విషయమై 23మంది ప్రముఖ ఆర్థిక వేత్తలు ఇటీవల ఇజ్రాయిల్ ప్రధానికి, నెసెట్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. గాజాలో శాశ్వతంగా కరువు నెలకొనేలా, అక్కడి ప్రజలను స్థానభ్రంశులను చేసే చర్యలను ఇజ్రాయిల్ కొనసాగిస్తోందని ఆ లేఖ పేర్కొంది. యుద్ధాన్ని తక్షణమే ముగించడమే ప్రస్తుతం అవసరమైన చర్య అని, అదే తర్వాతి చర్యలకు నాంది ప్రస్తావన అవుతుందని ఆర్థికవేత్తలు స్పష్టం చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపాలంటూ తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, ఆ మేరకు డిమాండ్లు చేయాలని వారు పలువురు నేతలను, ఆర్థిక సంస్థలను కోరారు.

ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం నేడు

ముంబయి : ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సిపి రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్ పదవికి గురువారం రాజీనామా చేశారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అప్పగించారు. శుక్రవారం జరగనున్న సిపి రాధాకృష్ణన్ ప్రమాణం స్వీకార కార్యక్రమానికి సిఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు.

కేంద్రం కుట్రలను తిప్పికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలకు సహకారం అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, రా మెటీరియల్ ఇవ్వకుండా నష్టాల బారినపడే విధంగా కుట్ర పన్నుతోందని వివరించారు. మోడీ, అమిత్ షాతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోహన్ భగత్ కలిసి కుట్రలో భాగమయ్యారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి వీలులేదనే హెచ్చరికను ఈ మహా ప్రదర్శన, బహిరంగ సభ ద్వారా కేంద్రానికి పంపుతున్నామన్నారు. కేరళ రాష్ట్రంలోని వల్లూరు హిందుస్థాన్ న్యూస్ ప్రింట్ సంస్థను ప్రైవేటీకరిస్తామని కేంద్రం ప్రకటిస్తే... దానిని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడానికి ముందుకు వచ్చిందని, అలా ఇక్కడి స్టీల్‌ప్లాంట్‌ను నడపగలిగే సత్తా ఎపి రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? అని చంద్రబాబును బేబీ ప్రశ్నించారు. దేశంలో సమస్యలన్నిటినీ పక్కనపెట్టి కేంద్రం అదాని, అంబానిల కోసం పనిచేస్తోందన్నారు. ప్రజలంతా ఒక్కటై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కరిమింగిన వెలగపండును చేశారని, ప్రైవేటీకరణ లేదని చెబుతూనే 42 విభాగాలను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. ప్రధానమంత్రి ఏడాదిలో మూడుసార్లు విశాఖపట్నం వచ్చినా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఒక్క మాటా మాట్లాడలేదని గుర్తు చేశారు. 2021లో కేంద్ర ప్రభుత్వం స్ట్రాటజిక్ సేల్ పేరుతో చేసిన ప్రకటనకు కట్టుబడి స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు ముక్కలుగా చేసి అమ్మేస్తున్నారని, టిడిపి దానికి సహకరిస్తూ తన పతనానికి తానే పునాది వేసుకుంటోందని అన్నారు. ఆ పార్టీ స్థానిక నేతలు స్టీల్‌ప్లాంట్‌కు కార్మికులే నష్టం చేకూరుస్తున్నారని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభకు కనీసం కుర్చీలు వేసుకోవడానికి కూడా టిడిపి కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. విశాఖ ఉక్కు వల్లే ఈ ప్రాంతం ఇంతలా అభివృద్ధి చెందిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎన్.రామారావు, అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'తురకపాలెం' మరణాల నమోదులో నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. ఇకపై అలా జరగడానికి వీల్లేదన్నారు. విజయవాడలో డయేరియా కేసులు నమోదయినప్పుడు ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంటనే సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశారని, ఇదే స్ఫూర్తితో జిల్లా అధికారులు వ్యవహరించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. నియంత్రణ చర్యల్లో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనీసం మూడేళ్ల నుంచి నమోదవుతున్న కేసులకనుగుణంగా ప్రస్తుత సీజనల్ వ్యాధుల రాకను గమనించి అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు.

సుప్రీంకోర్టు శక్తి ఉడిగి కూర్చోవాలా?

(మొదటిపేజీ తరువాయి)

పాత్రను రాజ్యాంగ రూపకర్తలు పరిశీలించేటప్పుడు పరస్పర సామరస్య వాతావరణం వుంటుందని భావించారు. అందువల్ల గవర్నర్లను నియమించే టప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కేంద్రం గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం వుంది' అని గవాయ్ వ్యాఖ్యలు చేశారు. ఆర్టికల్ 200 కింద గవర్నర్‌ను ఒక నిర్దిష్ట పద్ధతిలోనే నిర్ణయం తీసుకోవాలని కోర్టు కోరలేదని, కానీ గవర్నర్ ఒక నిర్ణయం తీసుకోవాల్సిందేనని కోర్టు కోరవచ్చని జస్టిస్ జె. సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. తరువాత సందర్భాల్లో మాండమస్‌ను జారీ చేయవచ్చని అన్నారు. బిల్లులను ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు న్యాయస్థానాలు కాలపరిమితులను విధించవచ్చా అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును వివరణ కోరారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించారు. వాటిపై న్యాయ సలహా కోరారు. దీంతో ఈ అంశంపై తమ అభిప్రాయాలను తెలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు కోరింది. బిజెపి పాలిత రాష్ట్రాలు గవర్నర్లు, రాష్ట్రపతికి అనుకూలంగా అభిప్రాయం వ్యక్తం చేశాయి. బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు నిర్ణీత గడువు ఉండాలని తమిళనాడు, కేరళ, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు స్పష్టం చేశాయి. మొత్తంగా వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిజాన్ని సాధించాలంటే కనీసం ప్రజాస్వామ్యం, లౌకికభావం ఉండాలన్నారు. ఎన్ని భిన్నత్వాలు ఉన్నా ప్రతిపక్షాలన్నీ బిజెపికి వ్యతిరేకంగా ఒకతాటిపైకి వచ్చాయంటే వామపక్షాలు, అందులోనూ సీతారాం ఏచూరి వల్లే సాధ్యమైందన్నారు. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కొన్ని ప్రతిపక్షపార్టీలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వైసిపి, జనసేన బిజెపి పంచన చేరి, రాష్ట్ర రాజకీయాలను దౌర్భాగ్యస్థితికి తీసుకెళ్లాయని అన్నారు. బిజెడి, బిఆర్‌ఎస్, అకాళీదళ్ కూడా ప్రతిపక్షాలతో కలిస్తే బాగుండేదన్నారు. సీతారాంఏచూరి ఉండి ఉంటే ఆ కర్తవ్యాన్ని నెరవేర్చేవారని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి ఓడిపోతే అఖిల భారతస్థాయిలో ఓడిపోతామని బిజెపికి భయం పట్టుకోవడంతో ఎస్‌ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల జనాభాను తెగల, కులాల వారీగా గణిస్తున్నారని, మిగతా కులాలను గణించాలంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వ్యతిరేకించాయన్నారు. ఇప్పుడు ఓటమి భయంతో కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. కేంద్రంలో బిజెపి పూర్తి అధికారం కోల్పోయి రెండు పార్టీల భుజాల మీద నిలబడాల్సి వచ్చిందని, ఈ సమయంలో వెనుకబడిన తరగతుల వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఓటర్ల జాబితాలో మార్పుల ద్వారా ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. ఫెడరలిజానికి నష్టం చేసే ప్రయత్నాలు చేస్తే అప్పట్లో యువకుడిగా ఉన్న ఏచూరి దాన్ని కాపాడే ప్రయత్నం చేశారని, ఇప్పుడు పాలకులు మరలా అదే పనిచేస్తున్నారన్నారు. ఇప్పుడు సంఘపరివార్ ఏకత్వం తప్ప భిన్నత్వం ఉండకూడదని చెబుతోందన్నారు. సింధూనాగరికత, గ్రీకు నుండి వచ్చిన హిందూ, ఇండియా అనే పదాలకు ఇప్పుడు మతం రంగు పులిమారని పేర్కొన్నారు. గ్రంథాల్లోనూ, మరెక్కడా కూడా హిందూయిజం అనే మాటే లేదన్నారు. జంబూద్వీపం, భరతవర్షలోనూ మతం లేదన్నారు. ఇలాంటి చరిత్రను చెప్పకుండా మతప్రాతిపదికన నడుస్తున్న దేశంగా ఉన్నట్లు రాజ్యాంగలోనూ, అన్నిట్లోనూ మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దేశం అభివృద్ధిని కోరుకునేవారు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందుకు పోవాలనేవారు మతోన్మాదాన్ని అడ్డుకోవాలని రాఘవులు పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇష్టంవచ్చినట్లు టారిఫ్‌ల భారం మోపుతున్నా కనీసం ప్రశ్నించలేని స్థితిలో ప్రధాని మోడీ ఉన్నారని అన్నారు. సుంకాలతో దిమ్మతిరిగిన మోడీ వెంటనే చైనా, రష్యా వద్దకు పరిగెత్తారని, ఇప్పుడు ఎవరితో ఉండాలో తేల్చుకోలేని స్థితిలో ఉన్నారని అన్నారు. విదేశాంగ విధానంలో తలదించుకునే పరిస్థితి తీసుకువచ్చారని చెప్పారు. గాజాలో అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న విధ్వంసాన్ని ఆపాలని నాలుగువేల మంది మేధావులు కోరుతున్నారని, అయినా, ఇజ్రాయిల్‌ను ఒక్క మాట కూడా అనలేని స్థితిలో మోడీ ఉన్నారని చెప్పారు. జిఎస్‌టి శ్లాబుల మార్పు పేరుతో కేంద్రం దోచుకుంటోందని అన్నారు. రాష్ట్రాల ఆదాయాన్ని లాక్కుని అడుక్కునే పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత పాలకులకు ప్రజాస్వామ్యం పట్టడం లేదన్నారు. భూములు యథేచ్ఛగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మహిళలకు రక్షణ లేదని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మార్క్సిజాన్ని, లెనినిజాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి నిర్వహించిన పాత్ర మరువలేదనిదని అన్నారు. ఆయనకు నివాళి అర్పించడం అంటే ప్రస్తుత పరిస్థితులను గుర్తుచేసుకుని భవిష్యత్‌ను నిర్దేశించుకోవడం అన్నారు. సోషలిజం వెనక్కు వెళ్లదని ఏచూరి ఎప్పుడూ చెప్పేవారన్నారు. తొలుత వక్తలను సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ వేదిక మీదకు ఆహ్వానించారు. ప్రజానాట్యమండలి కళాకారులు అనిల్ తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు. అభ్యుదయ గేయాలకు నృత్యప్రదర్శన చేసిన కళాకారులను రాఘవులు, రమాదేవి సత్కరించారు. ఈ సందర్భంగా ఏచూరి వ్యాసాలతో ప్రజాశక్తి బుక్‌హౌస్, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంయుక్తంగా ప్రచురించిన 'ఓ సోషలిస్టు ఆచరణ పథం' పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు.



జీవన సౌరభం

సాధించాలన్న ఆలోచన నీ మనసులో ఉన్నంతకాలం ఎన్ని అడ్డంకులు వచ్చినా విజయాన్ని ఆపలేవు

మీ కోసం

ఉసిరికాయ పొడి నిమ్మరసంతో కలిపి రాస్తే ముఖంపైన ముడతలు తగ్గుతాయి.







ఆ యాప్‌తో ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట

స్మార్ట్ ఫోన్ వాడటం అంత ఈజీ కాదని అమ్మమ్మ తాతయ్యలు ఎప్పుడూ అంటారు. పిల్లలకి దూరంగా ఉన్న చాలామంది పెద్దలు ఈ టెక్నాలజీని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లు ఆన్‌లైన్ మోసాలకు గురవుతుంటారు. ఈ పరిస్థితి ఇక నుండి వాళ్లకి రాకూడదని భావించింది టెక్సాస్‌కి చెందిన 17 ఏళ్ల తేజస్వి మనోజ్. భారతీయ సంతతికి చెందిన తేజస్వి, అమ్మమ్మ, తాతయ్య ఇక నుండి ఆన్‌లైన్ మోసాలకు గురవ్వకుండా వాళ్లని ఎడ్యుకేట్ చేసేలా 'షీల్డ్ సీనియర్స్' పేరుతో సురక్షితమైన ఓ యాప్‌ని కోడింగ్ చేసింది. ఈ కృషికి గాను 'టైమ్స్ కిడ్ ఆఫ్ ద ఇయర్ 2025' అవార్డు ఆమెకి దక్కింది.

డల్లాస్‌లో పుట్టి పెరిగిన తేజస్వి, ఎనిమిదేళ్లప్పుడు అమెరికాకి వెళ్లింది. అక్కడే తన విద్యాభ్యాసం కొనసాగించింది. అప్పుడే కోడింగ్‌పై మక్కువ పెంచుకుంది. 'కోడింగ్ నాకు ఓ అద్భుతంలా అనిపించింది. భవిష్యత్తులో దాన్ని మరింతగా అధ్యయనం చేయాలని బాల్యంలోనే బలంగా అనుకున్నాను' అని తేజస్వి చెబుతోంది.

2024లో తేజస్వి తాతయ్య ఓ ఆన్‌లైన్ మోసానికి గురయ్యారు. మోసగాళ్లు బంధువుల్లా నటించి డబ్బులు అడిగారు. దీనిపై అంతగా అవగాహన లేని తేజస్వి తాతయ్య చాలా డబ్బులు పోగొట్టుకున్నారు. అప్పుడే 'షీల్డ్ సీనియర్స్' ఆలోచన తనకి వచ్చినట్లు ఈ సందర్భంగా తేజస్వి గుర్తుచేసుకున్నారు. ఇంకా ఆమె ఏం అన్నారంటే..

'షీల్డ్ సీనియర్స్ లక్ష్యం వృద్ధులు ఆన్‌లైన్లో స్వతంత్రంగా, నమ్మకంగా, గౌరవంగా ఉండేలా చూడడం. మోసాలను గుర్తించి, తప్పించుకునేలా సహాయం చేయడం' అని వివరించారు. టైమ్ కథనం ప్రకారం 2024లో ఆన్‌లైన్ మోసాల వల్ల దాదాపు రూ.500 కోట్ల నష్టం వాటిల్లింది. దీన్నిబట్టే తేజస్వి చేసిన ఈ ప్రయత్నం ఎంత అవసరమో అర్థమవుతుంది.

తేజస్వి చేసిన ఈ కృషి పలు అంతర్జాతీయ వేదికల్లో గుర్తింపు కూడా పొందింది. వృద్ధులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సెమినార్లలో ఆమె ప్రయత్నానికి ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఆ అనుభవాన్ని తేజస్వి ఇలా చెబుతోంది. 'మొదటిసారి సెమినార్ నిర్వహించినప్పుడు చాలా టెన్షన్‌గా అనిపించింది. కానీ అక్కడికి వచ్చిన పెద్దవారు ఎంతో ఆసక్తిగా వింటూ, నోట్సు రాసుకుంటున్నారు. అప్పుడు చాలా ఆనందమేసింది. కొంతమందైతే నన్ను ప్రశ్నలు అడిగి మరీ సమాధానాలు రాసుకున్నారు' అని చెప్పింది.

సాంకేతికతని అర్థం చేసుకోలేక ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్న ఎందరో పెద్ద వారికి తేజస్వి చేసిన ప్రయత్నం గొప్ప ఊతంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

ఆటబొమ్మలతో అందమైన ఇల్లు ...

చిన్న పిల్లలు ఆడుకునేందుకు అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల బొమ్మలు కొనేస్తుంటాం. కొన్ని రోజులకే అవి విరిగిపోవడమో, పాడైపోవడమో జరుగుతుంది. కొంత కాలం తరువాత ఏ ఉపయోగం లేనివాటిని చెత్తబుట్టలో పడేస్తాం. అయితే కేరళకి చెందిన ఓ ఇంటివారు అలా చేయలేదు. పిల్లలు ఆడిపారేసిన రకరకాల ఆటబొమ్మలతో అందమైన ఇంటిని కట్టుకున్నారు. వృత్తాకారంలో ఎటు వెళ్లినా ఇంట్లోకి వెళ్లేలా గుమ్మాలు పెట్టుకున్నారు. వారి వ్యక్తిగత గోప్యతకి భంగం కలగకుండా మంచి పడక గది నిర్మించుకున్నారు. తమ సృజనాత్మకతని పదిమందికి తెలియజేయాలని, ఇంటిని చూసేందుకు సందర్శకులకి కూడా అనుమతి ఇచ్చారు. దీంతో ఆ ఇంటి గురించి అందరికీ తెలిసింది. పిల్లలైతే తాము ఆడుకున్న వస్తువులతో కట్టిన ఆ ఇంటిని చూసి అక్కడే ఉండిపోతున్నారంట.




కేరళ వడకరలో ఈ ఇంటి నిర్మాణం ఉంది. పెద్ద పెద్ద చెట్ల మధ్య కట్టిన ఈ బొమ్మల ఇంటిని 'వాల్ మేకర్స్' అనే సంస్థ ఫౌండర్ అయిన విను డానియల్, ఆయన బృందం నిర్మించింది. మొత్తం 6200 విరిగిపోయిన ఆటబొమ్మలను ఇంటి నిర్మాణం కోసం ఉపయోగించారు.

వృత్తాకారంలో ఉన్న ఈ ఇంటి మధ్యలోకి, మూడు ద్వారాల గుండా వెళ్లేలా కట్టారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా ఉన్న పెద్ద వరండా ఇంటి అందాన్ని రెట్టింపు చేసినట్లు ఉంటుంది. ఇంటి మధ్యలో గాజు పైకప్పుతో నిర్మించిన అంతర్గత ప్రాంగణం వల్ల సూర్యకాంతి సహజంగా లభిస్తుంది. కుటుంబ సభ్యులు, సందర్శకులు ఎవరికీ ఇబ్బంది లేకుండా దేనికదే ప్రత్యేకమైన గదులు నిర్మించారు. మంగుళూరు పెంకుల మధ్య విరిగిపోయిన బొమ్మలని అందంగా, నైపుణ్యంగా అమర్చిన తీరు చూస్తే ఔరా అనకుండా ఉండలేం. అంత అందంగా, నైపుణ్యంగా వాటిని పెట్టిన విధానం పిల్లలకే కాదు, పెద్దలకి కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది.

విదేశీ నిర్మాణశైలి కూడా ఈ ఇంట్లో కనిపిస్తుంది. జపాన్ శైలిలో షోజి తెరలను ఉపయోగించారు. దీనివల్ల ఇల్లు చాలా చల్లగా ఉంటుంది. లైబ్రరీ, వంటగదిని చూసి, యజమానుల అభిరుచి గురించి అందరూ మాట్లాడుకుంటారు. 'టాయ్ స్టోరీ రెసిడెన్స్'గా చలామణి అవుతున్న ఈ ఇంటి నిర్మాణంలో వాడిన ప్రతి బొమ్మ అక్కడికి వచ్చిన వారికి ఒక్కో కథ చెబుతుంటాయి.

తాతకు ప్రేమతో ...



తెల్ల మీసాల ఓ తాత !
మరువలేను నువ్వు చెప్పిన కథ
జవదాటను నువ్వు గీసిన గీత
నువ్వు చెప్పిన మాట
పెరుగన్నం సద్ది మూట
నువ్వు ఇచ్చిన ప్రోత్సాహం
నాకు కలిగించే ఉత్సాహం
పంచావు అందరికీ ప్రేమని
నింపావు నాలో స్ఫూర్తిని
నీ నుంచి చాలా నేర్చుకోవాలి
పదిమంది నన్ను మెచ్చుకోవాలి
నా విజయానికి నువ్వే కారణం
ఎప్పుడు తీరుతుంది నీ రుణం
తాత నేను అంటే నీకు ఎంతో ఇష్టం
మరువగలనా నువ్వు పడ్డ కష్టం
నువ్వు పెట్టిన జ్ఞానభిక్ష
అదే నేడు నాకు శ్రీరామరక్ష
నువ్వు నా
పక్కన ఉండగ
దిగులు
నాకెందుకు
దండగ.
ప్రేమతో నీ
మనమరాలు...



- ఈ.ప్రవస్థిక,
10 వ తరగతి,
గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల,
చింతకుంట, కరీంనగర్ జిల్లా.

మొక్కలు



నాటవలయు మొక్కలు
నమలవలయు ముక్కలు!
చూడరాదు దిక్కులు
చూపరాదు టెక్కులు!
ఆకసాన చుక్కలు
అందంగలవె లెక్కలు?
ఆటబొమ్మ రెక్కలు
ఆడగానె ముక్కలు!
కలత దెచ్చు చిక్కులు
కరవవచ్చు కుక్కలు
బండిలాగు బక్కలు
పడిన విరుగు బొక్కలు!
తినకు చింత పిక్కలు
తినకు కొన్ని తొక్కలు
ఆటలు మీ హక్కులు
ఆడండి మీరు పెక్కులు!

- కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.

నేను గీసిన బొమ్మ

రావూరి నవ్య, 4వ తరగతి,
ఎంపిపిఎస్, నల్ల చెరువు,
అయినవిల్లి మండలం,
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్,
కోనసీమ జిల్లా.







నందాల అక్షయ, ఆరవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హవేలి ఘణపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68